
కోటి రూపాయలకు టోకరా..!
మహిళా సంఘాలకు యానిమేటర్ బురిడీ
బాధితులు లబోదిబో.. 7



అంబేడ్కర్‌కు నివాళి



భీమవరం అంబేడ్కర్ సెంటర్‌లో విగ్రహం వద్ద నివాళులర్పించిన కలెక్టర్ నాగరాణి, అధికారులు

భీమవరం టౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): బడుగు వర్గాలు, మహిళల విద్యా వ్యాప్తికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశేష కృషి చేశారని కలెక్టర్ నాగరాణి అన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శనివారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో విగ్రహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో అంబేడ్కర్ విగ్రహానికి డీఆర్వో బి.శివన్నారాయణ రెడ్డి, పూలమాల వేసి నివాళులర్పించారు. ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, మునిసిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భీమవరంలో 3కే రన్

భీమవరంటౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రాణాలను కాపాడుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ట్రాఫిక్‌పై అవగాహనకు పట్టణంలో బీవీ.రాజు కూడలి నుంచి శనివారం 3కే రన్ నిర్వహించారు. ఎస్పీ అద్నాన్ నయీం అస్మి మాట్లాడుతూ యువత, ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి అందరికీ ఆదర్శంగా ఉండాలన్నారు. 'ఫిట్ ఇండియా కాన్సెప్ట్'తో విష్ణు కళాశాల విద్యార్థుల ప్రదర్శన ఆకట్టుకుంది. జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఏఎస్పీ వి.భీమారావు, డీఎస్పీ శ్రీవేద పాల్గొన్నారు.


3కే రన్‌లో కలెక్టర్ నాగరాణి, ఎస్పీ అస్మి, జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి, ఏఎస్పీ, డీఎస్పీ తదితరులు



హోంగార్డ్స్ వ్యవస్థాపక దినోత్సవంలో మాట్లాడుతున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

హోంగార్డులకు అండగా ఉంటాం

ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం క్రైం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖ ఆధ్వర్యంలో 63వ హోంగార్డ్స్ ఆవిర్భావ దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఎస్పీ అద్నాన్ నయీం అస్మి హోంగార్డ్స్ అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. హోంగార్డుల సంక్షేమానికి జిల్లా పోలీసు శాఖ ప్రాధాన్యం ఇస్తుందని, వారికి అండగా ఉంటుంద న్నారు. హోంగార్డ్స్ వ్యవస్థ ప్రజలు, పోలీసు బలగాలకు వెన్నెముకగా నిలుస్తోందని కొనియాడారు. శాంతి భద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, విపత్తు నిర్వహణతోపాటు జైళ్లు, అగ్నిమాపక వంటి కీలక విభాగాల్లో హోంగార్డులు నిబద్ధతతో విధులు నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. వారి ఆరోగ్య పరిరక్షణ, భవిష్యత్ భద్రతకు సంబంధించిన పలు కీలక అంశాలపై తక్షణ చర్య లు తీసుకోవాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. ఏఎస్పీ వి.భీమారావు, ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ ఎంవీవీ. సత్యనారాయణ, డీఎస్పీలు జి.శ్రీవేద, డి.విశ్వనాథ్, హోంగార్డు ఇన్‌చార్జి ఆర్ఎస్ఐ కె.గోపీకృష్ణ పాల్గొన్నారు.

శాంతిభద్రతలపై ముందస్తు ప్రణాళిక

క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగల నేపథ్యంలో జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ముం దస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లాలో శాంతి భద్రతలు, కేసుల పురోగతిపై జిల్లా పోలీసు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో శనివారం నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, పోక్సో, అత్యాచార కేసులు, రోడ్డు ప్రమాదాల కేసుల దర్యాప్తు తీరుతెన్నులపై పోలీస్ స్టేషన్ల వారీగా సమీక్షించారు. పెండింగ్ కేసుల సంఖ్యను తగ్గించాలని, నాణ్యమైన చార్జిషీట్లు దాఖలు చేసి నేరస్తులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ తెలిపారు. పోలీస్ స్టేషన్ల వారీగా కేసుల సంఖ్య, అరెస్టుల వివరాలు, చార్జిషీట్లు దాఖలు చేసిన స్థితి, దర్యాప్తు ఆలస్యానికి గల కారణాలపై నివేదికలు కోరారు. కేసుల ఛేదన, నేర నియంత్రణకు దోహదపడే పలు సూచనలు, మెలకువలను అధికారులకు దిశా నిర్దేశం చేశారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా బ్లాక్ స్పాట్లను గుర్తించి, ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు.

ఆస్పత్రికి సుస్తీ



భీమవరం ప్రభుత్వాసుపత్రి దుస్థితి

జిల్లాకేంద్రం భీమవరం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలందిస్తున్నా వసతులు అధ్వానం. జిల్లా ఆసుపత్రి, వంద పడకల స్థాయికి చేరాల్సిన ఆసుపత్రి అధికారులు, నాయకులు, అధికారుల నిర్లక్ష్యంతో 50 పడకలకే పరిమితమైంది. గత ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే ఆసుపత్రి నిర్మాణానికి కొంత భూమిని ఇచ్చినప్పటికీ నాలుగేళ్లుగా భవన నిర్మాణం నత్తనడకన సాగుతోంది.

- మెరుగైన వైద్య సేవలు
- వసతులు మాత్రం అధ్వానం
- 50 పడకలకే పరిమితం
- పూర్తికాని భవన నిర్మాణం
- రోగులకు తప్పని తిప్పలు

భీమవరం క్రైం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి):

భీమవరం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి రోజుకు సుమారు 500 మంది అవుట్ పేషెంట్లు వస్తారు. ఆసుపత్రిలో రోజుకు 4 నుంచి 5 వరకు ప్రసవాలు జరుగుతాయి. భీమవరం చుట్టుపక్కల ప్రాంతాలతోపాటు కాళ్ల, ఆకివీడు, ఉండి, పాలకోడేరు, వీరవాసరం, మొగల్తూరు మండలాలు, కృష్ణా జిల్లాలోని కృత్తివెన్ను మండలం నుంచి రోగులు వైద్యం కోసం వస్తుంటారు. ఎక్కడ ఏ ప్రమాదం జరిగినా, హత్యలు, ఆత్మహత్యలు జరిగితే మృతదేహాలను భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలిస్తారు. జిల్లా ఆసుపత్రిగా తీర్చిదిద్దవలసిన ఆస్పత్రిలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో రోగులు, బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

త్వరలోనే నూతన భవనం పూర్తి

గొల్లవానితిప్ప రోడ్డులో కొత్త ఆసుపత్రి భవన నిర్మాణం త్వరలోనే పూర్తయ్యే అవకాశాలున్నాయని భీమవరం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణ్ జితానంద్ తెలిపారు. ఇటీవల సంబంధిత ఇంజనీర్‌తో ఎమ్మెల్యే మాట్లాడారని, త్వరలోనే పూర్తవుతుందని కాంట్రాక్టర్ చెప్పారన్నారు. కొత్త భవనంలో వంద పడకలు అందుబాటులోకి వస్తాయని, చాలామంది రోగులకు వైద్యం సకాలంలో అందుతుందని తెలిపారు.

- లక్ష్మణ్ జితానంద్, ఆసుపత్రి సూపరింటెండెంట్

రూ.6.5 కోట్లతో కొత్త భవనం

గతంలో టీడీపీ ప్రభుత్వంలో అప్పటి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో పాత ప్రభుత్వ ఆసుపత్రి పక్కన కొత్త భవనానికి నిధులను మంజూరు చేశారు. సుమారు రూ.6.50 కోట్లతో కొత్త భవనం నిర్మించడంతో కొన్ని వైద్య విభాగాలు అందులోకి మార్చారు. దీనితో చాలా వరకు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. 50 పడకల ఆసుపత్రి కావడంతో వసతులు మాత్రం అరకొరగా ఉన్నాయని అంటున్నారు.

మరిన్ని వసతులు

నూతన భవన నిర్మాణం పూర్తయితే మరిన్ని వసతులు అందుబాటులోకి రానున్నాయి. ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. కొత్త భవనంలో పూర్తిస్థాయిలో డయాలసిస్ కేంద్రం అందుబాటులోకి రానుంది. చాలామంది కిడ్నీ బాధితులకు ఊరటనిచ్చినట్లు అవుతుంది. వేల రూపాయలు వెచ్చించి ప్రైవేట్ ఆసుపత్రుల్లో డయాలసిస్ చేయించుకునే బాధితులకు ఇబ్బందులు తొలగుతాయి. ఆకివీడులో ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు చొరవతో కిడ్నీ డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయడంతో చాలామంది అక్కడికి వెళుతున్నారు. ఇక్కడ కూడా ఏర్పాటుచేస్తే అవస్థలు తప్పుతాయి.


అసంపూర్తిగా ఆసుపత్రి భవన నిర్మాణం

కొత్త భవనానికి రూ.25 కోట్లు
ఎప్పటికి పూర్తవుతుందో..?

భీమవరం - గొల్లవానితిప్ప రోడ్డులో మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సహకారంతో కొంత భూమిని ప్రభుత్వానికి అందజేశారు. ఆ స్థలంలో ఆసుపత్రి భవన నిర్మాణానికి నాబార్డ్ నిధుల్లో ముందుగా సుమారు రూ.25 కోట్లు వరకు మంజూరైంది. నాలుగేళ్ల క్రితం చేపట్టిన పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. భవన నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుందోనని అందరూ ఆశగా ఎదురుచూస్తున్నారు. పట్టణానికి సుమారు 3 కిలోమీటర్ల దూరంలో ఉన్నా వంద పడకల ఆసుపత్రి పూర్తయితే మరింత మెరుగైన వైద్యం అందుతుందని రోగులు, బంధువులు భావిస్తున్నారు.

15 నుంచి వందే భారత్

నరసాపురం - చెన్నై సర్వీసు ప్రారంభమవుతుంది
కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ



భీమవరం టౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : నరసాపురం- చెన్నై వందే భారత్ రైలు సర్వీసు ఈనెల 15 నుంచి ప్రారంభం కానుందని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. భీమవరంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైల్వేశాఖ అడ్వాన్స్ రిజర్వేషన్ పీరియడ్ వల్ల జనవరి 12న ప్రారంభిస్తామని ప్రకటించినా ప్రజల విజ్ఞప్తి మేరకు పండగ కంటే ముందే రైలు సర్వీస్ ప్రారంభించాలని తాను చేసిన విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించారన్నారు. సికింద్రాబాద్ - విశాఖ వందే భారత్ తాడేపల్లిగూడెంలో హాల్ట్‌కు కూడా అనుమతి రానుందని తెలిపారు.

రూ. 1400 కోట్లతో జల జీవన్ మిషన్

గ్రామీణ ప్రాంత గృహాలకు తాగునీటి కోసం జల్ జీవన్ మిషన్ కింద జిల్లాలో రూ.1400 కోట్ల భారీ ప్రాజెక్టును త్వరలో ప్రారంభిస్తున్నట్లు వర్మ ప్రకటించారు. కొవ్వూరు మండలం బంగారమ్మపేటలో ధవళేశ్వరం బ్యారేజీ వద్ద 15.54 ఎకరాల్లో నిర్మించే వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో గోదావరి నీటిని శుద్ధిచేసి జిల్లాలో మారుమూల ప్రాంతానికి సైతం అందేవిధంగా 2663 కి.మీ పైప్‌లైన్ నెట్‌వర్క్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని 3,19,954 ఇళ్లకు ప్రతిరోజూ స్వచ్ఛమైన తాగునీరు పంపిణీ చేస్తామన్నారు.

త్వరలో ఎన్‌హెచ్-165కు టెండర్లు

ఆకివీడు- దిగమర్రు- భీమవరం బైపాస్‌తో కలిపి ఎన్‌హెచ్-165 నిర్మాణానికి సర్వే, డీపీఆర్, టెక్నికల్ సమస్యలు పరిష్కారం, ఇతర అనుమతులు సాధించామన్నారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టుకు ఫైనాన్స్ కమిటీ అనుమతి కోసం చివరి దశలో ఉందని, జనవరి నెలాఖరు నాటికి పనులు ప్రారంభానికి టెండర్ పిలుస్తామని ఆయన తెలిపారు.

రూ.10 కోట్లతో డయాలసిస్ సెంటర్లు

జిల్లాలో రూ.10 కోట్లతో డయాలసిస్ కేంద్రాల నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు వర్మ తెలిపారు. నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్‌లలో అత్యాధునిక డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. సుమారు రూ.10 కోట్ల కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులను వెచ్చిస్తున్నట్లు ఆయన తెలిపారు. తొలుత భీమవరం ఏరియా హాస్పిటల్ వద్ద రూ.2 కోట్లతో 8 అత్యాధునిక డయాలసిస్ యంత్రాలు, 8 బెడ్లు, ఆచంట సీహెచ్‌సీలో రూ.కోటి వ్యయంతో 3 డయాలసిస్ యంత్రాలు, 3 బెడ్లతో సెంటర్ ఏర్పాటుకు ఆదివారం భూమి పూజ నిర్వహిస్తున్నట్లు ఆయన ప్రకటించారు.

ప్రజారోగ్య సంరక్షణలో భాగంగా రూ.4 కోట్లతో అత్యాధునిక క్యాన్సర్ స్క్రీనింగ్ మొబైల్ యూనిట్ వ్యాన్ జిల్లా వాసులకు అందుబాటులోకి రానుందని కేంద్రమంత్రి వర్మ తెలిపారు. మారుమూల ప్రాంతాలకు వెళ్లి అక్కడిక్కడే మహిళలకు పరీక్షలు చేసి రిపోర్టులు అందిస్తారని తెలిపారు.

రేషన్ డీలర్లు



చౌక డిపోల ద్వారా సరుకుల పంపిణీపై ప్రభుత్వం ఇస్తున్న కమీషన్ పెంచాలంటూ కొన్నేళ్లుగా రేషన్ డీలర్లు డిమాండ్ చేస్తున్నారు. కమీషన్ పెరగకపోగా మరిన్ని బాధ్యతలు పెరగడంతో గిట్టుబాటు కావడం లేదని గగ్గోలు పెడుతున్నారు. ఒక్కొక్కరూ డీలర్‌షిప్ వదులుకుంటున్నారు. వయసు మీరిందని, పిల్లలు అందివచ్చారని, కమీషన్ గిట్టుబాటు కావడం లేదని జిల్లాలో 101 రేషన్ షాపుల డీలర్లు తప్పుకున్నారు. వారిస్థానంలో కొత్తవారిని భర్తీచేయకుండా మరొక డీలర్‌కు బాధ్యతలు అప్పగిస్తున్నారు. లేదంటే స్వయం సహాయక సంఘాలతో నడుపుతున్నారు.

- కమీషన్ గిట్టుబాటు కావడం లేదని గగ్గోలు
- చౌక డిపో బాధ్యతలకు చెల్లుచీటీ
- జిల్లాలో 101 రేషన్ దుకాణాలు ఖాళీ
- ఇన్‌చార్జిలు, మహిళా సంఘాలకు అప్పగింత
- భర్తీకి రాజకీయ నేతల ఒత్తిడి
- సాహసించని అధికారులు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఖాళీగా ఉన్న చౌకడిపోలకు డీలర్లను ఏర్పాటు చేయాల్సి ఉంది. గతంలో రోస్టర్ ప్రకారం చౌక డిపోలు కేటాయించడంతో పాటు రిజర్వేషన్లను అమలు చేశారు. ప్రస్తుతం అదేవిధంగా భర్తీ చేయాల్సి ఉండగా రాజకీయ నేతల ఆకాంక్షలు వేరేగా ఉంటున్నాయి. తమ సానుభూతిపరులకు కేటాయించాలంటూ అధికారులపై ఒత్తిడి పెంచుతున్నారు. నిబంధనలు మార్పు చేసి నోటిఫికేషన్ విడుదల చేయాలంటూ అధికారులపై ఒత్తిడి పెంచుతున్నారు. వాస్తవానికి జిల్లాలో 1052 రేషన్ షాపులున్నాయి. 101 షాపులకు డీలర్లు లేరు. వాటిలో 70 షాపుల బాధ్యతను స్వయం సహాయక సంఘాలకు అప్పగించారు. మరో 31 షాపుల్లో ఇన్‌చార్జిలను నియమించారు. రాజకీయ ఒత్తిడి నేపథ్యంలో భర్తీకి అధికారులు సాహసించడం లేదు.

కమీషన్‌కోసం ఎదురుచూపు

ఇటీవల ప్రభుత్వం కమీషన్‌ల మంజూరులో కొత్త విధానాన్ని అమలు చేస్తోంది. జిల్లాలో 5,62,689 రేషన్ కార్డులున్నాయి. వాటిలో 1,46,729 కార్డులకు కేంద్ర ప్రభుత్వం ప్రతీనెలా 2762 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని లబ్ధిదారులకు ఉచితంగా అందజేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన 4,15,960 కార్డులకు ప్రతినెలా 5580 టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నారు. కిలో బియ్యానికి రేషన్ డీలర్లకు రూపాయి వంతున కమీషన్ చెల్లిస్తున్నారు. ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేర్వేరుగా కమీషన్ జమ చేసేలా నిర్ణయం తీసుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే కమీషన్‌ను రేషన్ డీలర్లు పంచదార కొనుగోలు చేయడానికి మళ్లిస్తున్నారు. రేషన్ పంపిణీలో లబ్ధిదారులకు పంచదార కూడా పంపిణీచేసి ఆ సొమ్మును కమీషన్ రూపంలో సొంత అవసరాలకు వినియోగించుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం పంపిణీ చేసిన బియ్యానికి నేరుగా డీలర్ల ఖాతాలో జమ చేస్తా మని ప్రకటించినా గడచిన మూడు నెలల నుంచి పెండింగ్‌లో పెట్టింది. మొత్తంపైన జిల్లాలోని రేషన్ డీలర్లకు కేంద్రం నుంచి రూ.82.86 లక్షలు రావాల్సి ఉంది. ఆ సొమ్ముల కోసం డీలర్లు ఎదురుచూస్తున్నారు.

పెరిగిన ఖర్చులు

ప్రస్తుతం డీలర్‌కు కమీషన్ గిట్టుబాటు కావడం లేదు. వృద్ధులకు ప్రతినెలా ఇంటింటికి వెళ్లి బియ్యం చేరవేయడానికి రవాణా చార్జీలు ఇవ్వాలంటూ డీలర్లు ప్రతిపాదిస్తున్నారు. మరోవైపు పట్టణాలు, పల్లెల్లో రేషన్ షాపుల అద్దెలు పెరిగిపోయాయి. వైసీపీ ప్రభుత్వంలో బియ్యం సంచులను కూడా వెనక్కు తీసుకున్నారు. సొమ్ములను జమ చేస్తామని డీలర్లకు భరోసా ఇచ్చినా మొండిచేయి చూపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బియ్యం సంచులను డీలర్లకే విడచి పెడుతోంది. వాటి విక్రయాల ద్వారా అదనంగా రూ.2వేలు కలసి వస్తోంది. కార్డుల సంఖ్యను బట్టి నెలకు కమీషన్ రూపంలో రూ.10వేల నుంచి రూ.15వేల వరకు లభిస్తోంది. అద్దె, ఇతర ఖర్చులు పోతే పెద్దగా మిగిలేదేమీ లేదంటూ డీలర్లు పెదవి విరుస్తున్నారు. కమీషన్ పెంచాలంటూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూనే ఉన్నారు. ఇప్పటిదాకా అనుకూలమైన నిర్ణయం రాలేదు. ఫలితంగా పాత వారు ఒక్కొక్కరుగా వైదొలగుతున్నారు. వారి స్థానంలో తమ వారికే రేషన్ షాపు కేటాయించేలా రాజకీయ ఒత్తిడి రావడంతో అధికార యంత్రాంగం ప్రత్యామ్నాయ పద్ధతుల్లో రేషన్ పంపిణీ చేస్తోంది.

మునిసిపాలిటీకి తాళం

డంపింగ్ యార్డుపై నరసాపురం కౌన్సిల్ గరం గరం

- సమావేశంలో చర్చించాలని కూటమి సభ్యుల పట్టు
- మరోసారి చర్చిద్దామన్న చైర్‌పర్సన్, వైసీపీ కౌన్సిలర్లు
- సమావేశం నుంచి వెళ్లిపోనున్న అధికార పక్ష సభ్యులు
- గేటుకు తాళాలు వేసిన నిరసన వ్యక్తం చేసిన ప్రతిపక్షం




చైర్‌పర్సన్ పోడియం వద్ద కౌన్సిలర్లు

నరసాపురం టౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలో చెత్త డంపింగ్ సమస్య కౌన్సిల్‌లో దుమారం రేపుతోంది. కౌన్సిల్ సమావేశంలో కూటమి సభ్యులు, చైర్‌పర్సన్, వైసీపీ సభ్యుల మధ్య వాడీ వేడి చర్చ సాగింది. అధికారులు సూచించిన స్థలంలో చెత్త డంపింగ్‌పై తీర్మానానికి కూటమి సభ్యులు పట్టుబట్టారు. నిధుల లభ్యతను బట్టి తర్వాత చర్చిద్దామని చైర్‌పర్సన్, వైసీపీ సభ్యులు చెప్పడంతో కౌన్సిలర్లు చైర్‌పర్సన్ పోడియంను చుట్టుముట్టారు. సమాధానం చెప్పకుండా చైర్‌పర్సన్ వెళ్లిపోవడంతో కూటమి సభ్యులు గేటుకు తాళం వేశారు.

పట్టణంలో చెత్త సమస్య ప్రజను వేధిస్తుంటే.. డంపింగ్ యార్డు ఏర్పాటు రాజకీయ వివాదాలకు వేదికగా మారుతోంది. మునిసిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణ అధ్యక్షతన శనివారం జరిగిన కౌన్సిల్ అత్యవసర సమావేశంలో అజెండాలో పొందుపరిచిన డంపింగ్ యార్డు సమస్య పరిష్కారంపై సభ్యులు పట్టుబట్టారు. దీనిపై మరోసారి చర్చిద్దామని చైర్‌పర్సన్ దాటవేశారు. మునిసిపల్ అధికారులు చూపించిన స్థలంలోనే చెత్త డంపింగ్‌కు ఆమోదిస్తే సమస్య తీరుతుందని, తక్షణం తీర్మానం చేయాలని వీసీ కొత్తపల్లి నాని, కౌన్సిలర్లు వన్నెంరెడ్డి శ్రీను, కోటిపల్లి సురేష్, కేసరి గంగరాజు, కృష్ణవేణి, అరుణ పట్టుబట్టారు. చైర్‌పర్సన్ వెంకటరమణ మాట్లాడుతూ డపింగ్‌యార్డు సమస్యకు తాము వ్యతిరేకం కాదని, నిధుల సమస్య, రోడ్డు సాధ్య సాధ్యాలపై మరోసారి చర్చిద్దామని చెప్పారు. కౌన్సిల్ సుముఖంగా ఉంటే మీరెందుకు అమోదించడం లేదని ప్రశ్నించారు. పోడియం వద్ద వెళ్లి సమస్యను పరిష్కరించాలని చైర్‌పర్సన్‌కు విన్నవించారు. వైసీపీ కౌన్సిలర్ జయరాజు మాట్లాడుతూ డపింగ్‌యార్డు ప్రదేశం పల్లపు ప్రాంతం కావడంతో రూ 30లక్షలతో రోడ్డు వేసినా ప్రయోజనం ఉండదన్నారు. నిధుల కోసం ఎమ్మెల్యే నాయకర్, ఎంపీ, ప్రభుత్వం దృష్టికి తీసుకెళదామన్నారు. చైర్‌పర్సన్, వైసీపీ కౌన్సిలర్లు బయటకు వెళ్లడంతో వీసీ కొత్తపల్లి నాని, వన్నెంరెడ్డి శ్రీను, కోటిపల్లి సురేష్, పాలూరి బాబ్జీ, కేసరి గంగరాజు, కృష్ణవేణి, సురేష్, అరుణ మునిసిపల్

మిగతా 8వ పేజీలో..

9 నుంచి పాలకొల్లు రైలుగేటు మూసివేత

పాలకొల్లు అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణం నుంచి భీమవరం రోడ్డులో రైల్వే గేటును ఈనెల 9 నుంచి 14వ తేదీ రాత్రి 7గంటల వరకూ మూసివేయనున్నారు. డీఆర్‌యూసీసీ సభ్యుడు జక్కంపూడి కుమార్ శనివారం ఒక ప్రకటనలో వివరాలు తెలిపారు. రైల్వే ట్రాక్ మరమ్మతుల కారణంగా గేటు మూసివేస్తారని, వాహనదారులు పూలపల్లి బైపాస్ రోడ్డు ద్వారా రాకపోకలు సాగించాలని సూచించారు. పాదచారులు, సైక్లిస్టులు కూడా ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని సూచించారు.

సెలవు రోజుల్లోనూ టెన్త్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

ఏలూరు అర్బన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సెలవు రోజుల్లో కూడా మధ్యాహ్న భోజనం అమలు చేయనున్నారు. ఈ మేరకు పాఠశాల విద్య ఎండీఎం విభాగం ఉన్నతాధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మార్చి 10 వరకు రెండో శనివారం, ఆదివారం సెలవులతో సహా, సాధారణ సెలవురోజుల్లోనూ 100 రోజుల కార్యాచరణ అమలు చేస్తున్న విషయం విదితమే. సెలవు రోజుల్లో ప్రత్యేక తరగతులకు విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని వర్తింపజేయాలని భావించిన ప్రభుత్వం ఆ మేరకు నిర్ణయం తీసుకుంది.

ఏలూరు జిల్లాలో మరొకరికి స్క్రబ్ టైఫస్! 7
నూజివీడు నుంచి విజయవాడ తరలింపు



అన్ని రంగాల్లో ప్రతిభను చాటాలి: కలెక్టర్

జిల్లాస్థాయి విభిన్న ప్రతిభావంతుల క్రీడలు ప్రారంభం

భీమవరం టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులు ధైర్యంగా ముందుకు నడవాలని, సాధారణ వ్యక్తులకు తీసిపోని విధంగా అన్ని రంగాలలో మీ ప్రతిభను చాటాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో శనివారం భీమవరం డీఎన్ఆర్ కళాశాల క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దివ్యాంగులు ఏ రంగంలోనూ తక్కువ కాదనేది ఇప్పటికే చాలా సందర్భాల్లో రుజువైందన్నారు. దివ్యాంగులు ఆ త్మస్థైర్యంతో ముందుకు నడవాలని, మంచి భవిష్యత్‌ను పొందాలని సూచించారు. అనంతరం జిల్లాస్థాయి విభిన్న ప్రతిభావంతుల క్రీడా పోటీలను కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, బి.రామ్ కుమార్, డిఎస్డిఓ ఎన్. మోహన దాసు పాల్గొన్నారు

జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్‌లో కీర్తన ప్రతిభ



గెల్చుకున్న కాంస్య పతకం చూపుతున్న కీర్తన

ఏలూరు రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏఆర్‌డీజీకే మునిసిపల్ కార్పొరేషన్ పాఠశాల 9వ తరగతి విద్యార్థిని సీహెచ్ కీర్తన ఎస్జీఎఫ్ జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ అండర్ 17 విభాగంలో కాంస్య పతకం సాధించిందని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.కాంతి జయకుమార్ తెలిపారు. ఇటీవల అరుణాచల్‌ప్రదేశ్‌లోని ఈటా నగర్‌లో జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో కాంస్య పతకం సాధించిందన్నారు. అలాగే ఇటీవల గుంటూరు జిల్లా రవీంద్రపాడులో జరిగిన రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో స్ట్రాంగ్ ఉమెన్ అవార్డు సొంతం చేసుకుందని కొనియాడారు. పాఠశాలలో జరి గిన అభినందన కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు అబ్బదాసరి జోజి బాబు, తోట శ్రీనివాస్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వ చేసిన ఎరువుల సీజ్



గొల్లగూడెంలో ఎరువుల దుకాణం తనిఖీ చేస్తున్న అధికారులు

నిడమర్రు డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా నిల్వచేసిన ఎరువుల స్టాక్‌ను సీజ్ చేసినట్లు కే.ఆర్.పురం ఏడీ పి.జి.బుజ్జి బాబు తెలిపారు. ఉంగుటూరు మండలం గొల్లగూడెంలో గోద్రేజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ ఎరువుల షాపులో ఆకస్మికంగా తనిఖీ చేసి స్టాక్, రికార్డులను పరిశీలించినట్టు తెలిపారు. ఈ పరిశీలనలో సరైన పత్రాలు, అనుమతులు లేకుండా అమ్మకం చేస్తున్నందున రూ.9,66,875 విలువ గల ఎరువులపై అమ్మకం నిలుపుదల నోటీసు ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎస్ఎస్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



ద్వారకాతిరుమల పోలీస్‌స్టేషన్‌కు తరలించిన రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుంటున్న సివిల్‌సప్లై అధికారులు

ద్వారకాతిరుమల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ద్వారకాతిరుమల శివారు వేపలమ్మ ఆలయం వద్ద శనివారం పోలీసులు పట్టుకున్నారు. కామవరపుకోట మండలం ఆడమిల్లి నుంచి నల్లజర్ల మండలం దూబచర్లకు మూడు టన్నుల రేషన్ బియ్యంతో టాటావాహనం వెళ్తోంది. ఘటనా స్థలం వద్దకు వచ్చేసరికి వాహన తనిఖీలు చేస్తున్న ద్వారకాతిరుమల పోలీసులకు ఈ వాహనం పట్టుబడింది. వెంటనే పోలీసులు వాహనాన్ని సీజ్ చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సీజ్ చేసిన బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులకు అందజేశారు.



తాడేపల్లిగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటం

తాడేపల్లిగూడెం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి):విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటాలు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు పి.రామ్మోహన్ పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ జిల్లా 47వ మహాసభలు పట్టణంలో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పట్టణలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభకు జిల్లా అధ్యక్షుడు బి.గణేశ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షుడు పి.రామ్మోహన్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటాలను ఎస్ఎఫ్ఐ చేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యార్థుల సమస్యలు పరిష్కరించలేదని ఆరోపించారు. తాడేపల్లిగూడెంలో ఉన్న నన్నయ్య యూనివర్సిటీ క్యాంపస్‌లో నామమాత్రపు పీజీ కోర్సులు మాత్రమే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తరువాత మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పేరుతో దారాదత్తం చేస్తున్నారని, సామాన్యునికి అందని ద్రాక్షగా మెడికల్ విద్యను తీసుకొస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రత్యేక రైళ్లు

ఏలూరు క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో అత్యవసరంగా నాలుగు రైళ్లను ప్రవేశపెడుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వేశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. రైలు నంబరు 07181 చర్లపల్లిలో ఈ నెల 7వ తేదీ రాత్రి 9.30 గంటలకు బయలుదేరి 8వ తేదీ రాత్రి 11.50 గంటలకు షాలిమార్ చేరుకుంటుంది. రైల్ నెంబర్ 07182 ఈనెల 9వ తేదీ మధ్యాహ్నం 12.10 గంటలకు బయలుదేరి 10వ తేదీ సాయంత్రం 4 గంటలకు చెర్లపల్లికి చేరుకుంటుంది.

నన్నయలో 8 నుంచి పీజీ స్పాట్ అడ్మిషన్లు

దివాన్‌చెరువు, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో మూడు క్యాంపస్‌లలో పీజీ కోర్సులకు ఈ నెల 8నుంచి 12 వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలను విశ్వవిద్యాలయంలో శనివారం ఆమె తెలియజేస్తూ నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్‌లలో పీజీ కోర్సులకు రాజమహేంద్రవరంలో క్యాంపస్‌లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తామని చెప్పారు. ఎంఏ, ఎంకామ్, ఎంపీఈడీ, ఎంఎస్సీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్‌లు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఏపీ పీజీసెట్‌లో అర్హత సాధించలేని వారు, సెట్‌కు హాజరు కాని అభ్యర్థులు కూడా పీజీ స్పాట్ అడ్మిషన్‌లలో ప్రవేశం పొందవచ్చన్నారు. సైన్స్ కోర్సులకు 8,9 తేదీల్లోను, ఆర్ట్స్ కోర్సులకు 10,11 తేదీల్లోను, ఏమైనా సందేహాలు, పెండింగ్‌లో ఉన్న సర్టిఫికెట్లు కోసం 12న స్పాట్ అడ్మిషన్‌లు జరుగుతాయని తెలిపారు. నన్నయ రాజమహేంద్రవరం క్యాంపస్‌లో డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఈ ప్రక్రియ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఎన్.నజనారాజ్ పర్యవేక్షిస్తారన్నారు. ఏపీ పీజీసెట్ 2025లో అర్హత సాధించిన అభ్యర్థులు రూ.500, పీజీ సెట్ అర్హత లేనివారు, పీజీ సెట్‌కు హాజరు కాని వారు రూ.800 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌ను సంప్రదించాలని వీసీ సూచించారు.

మళ్లీ పసిడి.. వెండి పరుగులు

» బంగారం గ్రాము బిస్కెట్ ధర రూ.13,200.. కేజీ వెండి రూ.1.83 లక్షలు



పండుగల సీజన్‌లోనూ షాపుల్లో సందడి నిల్

రానున్న రోజుల్లో మరింత పెంపు!

నరసాపురం/తాడేపల్లిగూడెం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తగ్గినట్లే తగ్గి.. మళ్లీ పసిడి, వెండి ధరలు పరుగులు తీస్తున్నా యి. గురువారం కేజీ వెండి బులియన్ మార్కెట్‌లో రూ.1.83లక్షలు పలికింది. ఇక పసిడి గ్రాము బిస్కెట్ రూ. 13,200 ఉండగా.. ఆర్నమెంట్ బంగారం రూ.12,200కి చేరింది. గత నెలలో ధరలు ఒక్కసారిగా దిగాయి. కేజీ వెండి రూ.1.40 లక్షలకు దిగింది. దీంతో ఇంకా పడిపోతుందన్న భయంతో చాలామంది ఆయినకాడికి అమ్ముకున్నారు. పసిడిలోనూ ఇదే పరిస్థితి. బిస్కెట్ బంగారం గ్రాము రూ.12,100కి పడింది. ఆర్నమెంట్ గ్రాము రూ.11,200 దిగి వచ్చింది. ఈ పరిణామాలు గమనించిన వినియోగ దారులు రానున్న రోజుల్లో వీటి ధరలు మరింత తగ్గుతాయని ఎదురు చూశారు. కానీ అంతర్జాతీయంగా నెలకొన్న పరిణామాల నేపథ్యంలో మళ్లీ క్రమంగా పెరుగుతూ వచ్చాయి. డాలర్ పతనం, క్రూడ్ ఆయిల్, స్టాక్‌మార్కెట్ పతనాలు, అమెరికాలో కొనసాగుతున్న షట్‌డౌన్, ఇంకా తొలగని రష్యా, ఉక్రెయిన్ల సమస్యలు పసిడి పెరుగుదలకు కారణంగా చెబుతున్నారు. డబ్బువిలువ తగ్గడంతో పెట్టుబడిదారులు బంగారంలో పెట్టుబడిపెట్టి పొదుపును కాపాడు కుంటున్నారు. భారత్, చైనా, రష్యా వంటి దేశాలు తమ నిల్వల్లో బంగారాన్ని పెంచుకుంటున్నాయి. వీటికి తోడు చాలాదేశాల బ్యాంకులు బంగారు నిల్వలు పెంచుకోవడం పెరు గుదలకు కారణంగా చెబుతున్నారు. ఇదే ట్రెండ్ కొనసాగితే రాను న్న రోజుల్లో వీటి ధరలు మరింత పెరుగుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ ప్రభావం జిల్లా బులియన్ మార్కెట్‌పై పడింది. ప్రస్తుతం పండుగల సీజన్ కావడంతో మంచి డిమాండ్ ఉంటుందని వ్యాపా రులు అంచనా వేసి దానికి అనుగుణంగా స్టాక్‌ను పెట్టారు. కానీ ధర పెరుగుదలతో వినియోగదారులు ఆచితూచి కొనుగోలు చేస్తున్నారు. ఈ కారణంగా నిత్యం రద్దీగా ఉండే నరసాపురం, భీమవరం బులియన్ మార్కెట్‌లో సందడి కనిపించడం లేదు.

బంగారంలో పెట్టుబడికి కొన్ని మార్గాలు

బంగారంలో పెట్టుబడి పెట్టడానికి భౌతిక బంగారం, గోల్డ్ ఈటీఎఫ్, డిజిటల్ గోల్డ్, సావరిన్ గోల్డ్ బాండ్లు వంటి మార్గాలు ఉన్నాయి. భౌతిక బంగారం అంటే నాణేలు, బార్లు లేదా ఆభరణాలను బ్యాంకులు, జ్యూవెలర్ల వద్ద కొనడం వంటివి. శుద్ధ బంగారం కొనాలి అనే వారికి నాణేలు, బారులు ఉత్తమమైన ఎంపిక. గోల్డ్ ఈటీఎఫ్‌లు బంగారాన్ని ప్రత్యక్షంగా కాకుండా స్టాక్ ఎక్స్ఛేంజ్ ద్వారా పెట్టుబడి పెట్టాలనుకునే వారికి గోల్డ్ ఈటీఎఫ్ అనువైన మార్గంగా నిలుస్తు ంది.

గోల్డ్‌ను ఈటీఎఫ్‌లో ఎలా కొనాలి?

గోల్డ్ ఈటీఎఫ్‌లో కొనడానికి ముందుగా డీమ్యాట్, ట్రేడింగ్ అకౌంట్ తెరవాల్సి ఉంటుంది. తరువాత స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో లాగిన్ చేసి కొనుగోలు ఆర్డర్ ఇవ్వాలి.

డిజిటల్ గోల్డ్..

పెట్టుబడికి డిజిటల్ గోల్డ్ ఉత్తమ మార్గం. కేవలం రూ.10 నుంచి ఇందులో బంగారాన్ని కొనుగోలు చేయవచ్చు. దొంగతనం భయం ఉండదు. తయారీ ఖర్చులు అసలే ఉండవు. అయితే జీఎస్టీ మాత్రం ఉంటుంది. కొనే రేటు కంటే అమ్మే రేటు తక్కువగా ఉంటుందనేది మదుపరులు మరిచిపోవద్దు.

సావరిన్ గోల్డ్ బాండ్స్

భౌతిక బంగారం కాకుండా ప్రభుత్వ హామీతో బంగారంపై పెట్టుబడి పెట్టే పద్ధతే సావరిన్ గోల్డ్ బాండ్ విధానం. ఇవి రిజర్వ్ బ్యాంక్ ద్వారా జారీ అవుతాయి. వీటిపై ప్రతి ఏటా 2.5 శాతం వడ్డీతో బంగారం ధర పెరిగితే అదనపు లాభం కూడా ఇస్తారు. గడవు వరకు ఉంచితే పన్ను లాభాలు ఉంటాయి. ప్రస్తుతం కొత్త ఇష్యూ అందుబాటులో లేకపోయినా సెకండరీ మార్కెట్లో కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది.

కూటమి ప్రభుత్వంలో రైతులకు మేలు



ఆవుదూడను నిమురుతున్న మంత్రి

యలమంచిలి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతుల మేలుకోసం చిత్తశుద్ధితో పనిచేసేది ఎన్డీఏ కూటమి ప్రభుత్వమేనని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలంలోని మట్లపాలెంలో శనివారం నిర్వహించిన పశువుల దాణా పంపిణీ, లేగ పెయ్యిదూడల అందాల పోటీలు, పశువైద్యశిబిరం కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. 50శాతం రాయితీపై పశువుల దాణాను మంత్రి రామానాయుడు 200 మంది పాడిరైతులకు అంద జేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పాడి,పంటలు బాగుంటేనే రైతు బాగుంటాడనే సదుద్దేశంతో వారికి అనేక ప్రోత్సా హకాలను, పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. పాలకొల్లు నియోజకవర్గంలో పాడిరైతులకు 50శాతం రాయితీపై 110 టన్నుల పశువుల దాణాను 1750మంది రైతులకు అందించామన్నారు. 50కేజీల బస్తా విలువ రూ.1110 కాగా రాయితీపై రైతుకు రూ.555కే అందిస్తున్నామని, నియోజకవర్గం మొత్తం మీద రైతులకు 12లక్షల 21వేలు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు మామిడిశెట్టి పెద్దిరాజు, డేగల సత్యనారాయణ, అడబాల చిట్టిబాబు, ఆరుమిల్లి రామశ్రీనివాస్, బోనం చినబాబు, పశుసంవర్ధకశాఖ అధికారులు పాల్గొన్నారు.

మేధావి క్రీడ చెస్: కృష్ణ తేజ



కృష్ణ తేజను అభినందిస్తున్న మంత్రి డాక్టర్ నిమ్మల

పాలకొల్లు టౌన్, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): మేధావి క్రీడ చదరంగం (చెస్) ద్వారా విద్యార్థులకు మేథాశక్తి పెంపొందుతుందని ఇంటర్నేషనల్ చెస్ క్రీడాకారుడు కృష్ణ తేజ అన్నారు. స్థానిక యూరో కిడ్స్‌స్కూల్లో శనివారం 55 మంది విద్యార్థులతో ఒకే సారి చెస్ ఆడి తనప్రతిభను చాటుకున్నారు. చెస్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రం, షీల్డులను మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అందజేశారు. కృష్ణ తేజను మంత్రి నిమ్మల రామానాయుడు అభినందించారు. ఈకార్యక్రమంలో ఎంఈవో గుమ్మళ్ళ వీరాస్వామి, జిల్లా చెస్ అధ్యక్షుడు మాదాసు కిషోర్, యూరో కిడ్స్ డైరెక్టర్ ఎంఆర్ఆర్ రాజేష్, ప్రిన్సిపాల్ వి.ప్రతిమ, కృష్ణతేజ తండ్రి వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లా క్రాస్ కంట్రీ జట్ల ఎంపిక పోటీలు

తణుకు రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):ఈనెల 8వ తేదీన జిల్లా క్రాస్ కంట్రీ (రోడ్ రన్) జట్ల ఎంపిక పోటీలు తణుకులో నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సంకు సూర్యనారాయణ తెలిపారు. సోమవా రం ఉదయం 6 గంటలకు తణుకు డీమార్ట్ వద్ద ఈపోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈపోటీలు అండర్ 16, 18, 20 విభాగాలలో బాలికలు, బాలుర విభాగాలుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈపోటీలలో ఎంపికైన వారు డిసెం బరు 24న తూర్పు గోదావరి జిల్లా పెద్దాపురంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. మరిన్ని వివరాలకు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అ ధ్యక్షుడు చింతకాయల సత్యనారాయణ 98853 91602, కార్యదర్శి సంకు సూర్యనారాయణ 99893 63978, కోశాధికారి కటికితల బాబూరావు 96762 51733 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.



శ్రీవారికి సహస్ర దీపార్చన

భీమవరం టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):జువ్వలపాలెం రోడ్డులోని పద్మావతి వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి స్వామివారికి, అమ్మవారికి సహస్రదీపాలంకరణ నిర్వహించారు. ఆలయ అర్చకుడు వాడపల్లి ఆదినారాయణాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి, అమ్మవారికి తులసీ దళాలతో పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకారం చేసిన ఊయ్యాలలో ఉంచి సహ స్రదీపాలను వెలిగించి హారతులను ఇచ్చారు. దీపాల వెలుగులో దర్శించుకున్నారు.



శ్రీవారి దర్శనానికి వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో వేచి ఉన్న యాత్రికులు

గోవింద నామాలతో పులకించిన శ్రీవారి క్షేత్రం

ద్వారకాతిరుమల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి సన్నిధి గోవిందనామాలతో మారుమ్రోగింది. విదియ మంచి తిది కావడం, శనివారం అవడం వల్ల ఆలయం భక్తుల రాకతో కళకళలాడింది. ఆలయానికి దాదాపు 20వేల మంది వరకు భక్తులు వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించినట్లు ఆలయవర్గాలు భావిస్తున్నాయి. ఆలయానికి వచ్చిన పలువురు యాత్రికులు ముందుగా కేశఖండనశాలలో మొక్కుబడులు తీర్చుకున్నారు. దర్శనానంతరం వారంతా స్వామివారి ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు. శ్రీవారి సాధారణ దర్శనానికి 2 గంటల పైబడి సమయం పట్టింది.



జడ్జి వాసంతి, ఇన్ఫర్మేషన్ కమిషనర్ సునీల్‌కు స్వామి వారి చిత్రపటాలు అందిస్తున్న ఆలయ అధికారులు

శివయ్యకు ప్రత్యేక పూజలు

పాలకొల్లు అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ క్షీరా రామలింగేశ్వర స్వామిని శనివారం అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి ఎ.వాసంతి, ఇన్‌ఫర్మేషన్ కమిషనర్ చావలి సునీల్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా వారికి అధికారులు, అర్చక స్వాములు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. వారికి ఆలయ పండితులు వేదాశీర్వచనంగావించి స్వామివారి శేష వస్త్రాన్ని, చిత్రపటాన్ని అందజేశారు. ఈకార్యక్రమాల్లో దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ వి.హరి సూర్య ప్రకాష్, తహసీల్దార్ వై.దుర్గా కిషోర్, ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సినీ హాస్యనటుడు, పాస్టర్ జోసఫ్ మృతి



సినీ నటుడు జోసఫ్ (ఫైల్)

నిడమర్రు డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పెదనింద్ర కొలను గ్రామానికి చెందిన పాస్టర్, సినీ హాస్యనటుడు మరిపూడి జోసఫ్ (47) గుండెపోటుతో గురువారం రాత్రి మరణించారు. చిలుకలూరిపేటకు క్రైస్తవ కూటమి కార్యక్రమాలుకు ఉపన్యాసకులుగా వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో గుండెపోటుకు గురై తుది శ్వాస విడిచారు. తల్లిదండ్రులు చనిపోయిన తర్వాత 25 సంవత్సరాలు క్రితం ఉంగుటూరు మండలం చేబ్రోలులో పాస్టర్ యోబు వద్దకు చేరి ఆయన వద్ద శిష్యరికం చేస్తూ ఉపన్యాసకులుగా మంచి పేరు సంపాదించారు. క్రైస్తవ ఉపన్యాసాలకు హ్యాసం జోడిస్తూ ఏసుక్రీస్తు వాక్యం చెప్పడంలో ఆయన అందవేసిన చెయ్యి. ఆయన పొట్టిగా ఉండడంతో గతంలో పాతాళభైరవితో పాటు ఆరు సినిమాలలో నటించి ప్రేక్షకులను అలరించారు. చనిపోయిన జోసఫ్ కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కాలనీల్లో సదుపాయాల కొరత



దేవ జగనన్న కాలనీలో అధ్వానంగా ఉన్న రహదారి

ప్రోబ్లమ్స్ జోన్

పెనుగొండ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 14 గ్రామపంచాయతీలు ఉన్నాయి. పలు గ్రామాల్లో ఎన్‌టీఆర్, వైఎస్ఆర్, ఇందిరమ్మ, జగనన్న కాలనీలు ఏర్పాడ్డాయి. చాలా కాలనీల్లో మౌలిక వసతులు కల్పన చేయక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు సమకూ ర్చి ఇళ్ల నిర్మాణ సముదాయం కోసం ఇప్ప టి వరకు సుమారు 39 కాలనీలు ఏ ర్పాటు చేశారు. ఈ కాలనీల్లో లబ్ధిదారు లు ఇళ్ల నిర్మాణాలు చేపట్టి చాలా మంది నివాసం ఉంటున్నా రు. వీటిలోని పలు కాలనీలు రహదారులు, మురుగు డ్రెయిన్‌లు నిర్మించకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దేవ జగనన్న కాలనీలో ఏళ్ల గడుస్తున్నా నేటికి మౌలిక వసతులు కానరావడం లే దు. లబ్ధిదారులకు ఏర్పాటు చేసిన కాలనీల్లో రహదారులు, డ్రెయిన్ వ్యవస్థ కల్పన ఊసే మర్చిపోయారు. మురుగు నీరు పారే దారి లేక ఇళ్ల వద్దే నీరు నిలిచి పోతుందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ములపర్రు శివారు సీతారాముని చెరువులో ఎన్నో ఏళ్ల క్రితం ఏర్పడిన కాలనీల్లో ము రుగు డ్రెయిన్ నిర్మించకపోవడంతో మురుగునీరు నిలిచిపోయి దోమలు వ్యాప్తి చెందుతున్నాయని ప్రజలు వాపోతున్నారు.



ములపర్రు శివారు సీతా రాముని చెరువు లో డ్రెయిన్ లేక నిలిచిన మురుగు



రెయిలింగ్ విరిగిపోయి శిథిలావస్థలో ఉన్న వంతెన

అదుపు తప్పితే కాలువలోకే..

పాలకొల్లు అర్బన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బ్రాడీ పేట- నాగరాజు పేటలను కలుపుతూ నరసాపురం ప్రధాన పంట కాలువపై 1998లో నిర్మించిన కాలి బాట వంతెన శిథిలావస్థకు చేరుకున్నది. ఈవంతెన మీదుగా గొల్లవాని చెరువు, కాపవరం, వాలమర్రు, తదితర గ్రామాలకు దగ్గర దారి కావడంతో నిత్యం వందలాదిగా ద్విచక్రవాహనాలు, పాదచారులు ప్రయాణాలు చేస్తూ ంటారు. వంతెనకు ఇరువైపులా రిటైనింగ్ వాల్ పూర్తిగా దెబ్బతింది. దీనితో వాహనదారులు ఏ మాత్రం అదుపు తప్పినా కాలువలోకి పడిపోయే ప్రమాదనం ఉన్నది. బ్రాడీపేట వైపు పాలకొల్లు మార్టేరు రోడ్డుపైకి, నాగరాజుపేట వైపు వడ్లవానిపాలెం అర్అండ్‌బి రోడ్డుపై పడిపోయే ప్రమాదం పొంచి ఉంది. ప్రయాణికులు మాత్రం తప్పని పరిస్థితుల్లో ప్రమాదం అని తెలిసినా వాహనాలపై తిరుగుతూనే ఉన్నారు. సేవా సంస్థల ప్రతినిధులు గతంలో కొంత మరమ్మతులు చేప్పటినప్పటికీ వంతెన రైలింగ్ మరలా పాడైపోయింది. పాలకులు, ప్రజాప్రతినిధులు పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదని పలువురు విమర్శిస్తున్నారు.

ముందుకు సాగని ఆరోగ్య కేంద్రాల నిర్మాణం

జిల్లాలో నాలుగు కేంద్రాలపై నీలినీడలు



కాళీపట్నం పడమరలో ఆసుపత్రి నిర్మాణానికి గుర్తించిన స్థలం

మొగల్తూరు. డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికి సర్కార్ వైద్యం అందించాలనే తలంపుతో గత వైసీపీ పాలనలో చేపట్టిన నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణ ప్రక్రియ ముందుకు సాగలేదు. జిల్లాలో కాళ్ళ మండలం కలవపూడి, మొగల్తూరు మండలం కాళీపట్నం, పోడూరు మం డలం గుమ్ములూరు, పాలకోడేరు మండలం పెన్నాడ గ్రామాల్లో ప్రాథమిక ఆసుపత్రుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇందుకు అనుగుణంగా అక్టోబరు 18, 2002న నాటి వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి ఎంటి కృష్ణబాబు ఒక్కొక్క ఆసుపత్రికి రూ.2.40 కోట్లు నిధులు (కేంద్ర ప్రభుత్వ నిధులు) విడుదల చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ ఆసుపత్రుల నిర్మాణాన్ని ఆర్అండ్‌బి శాఖ పర్యవేక్షణలో నిర్మాణం చేపట్టేలా ఆసమయంలో వెలువడ్డ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే జిల్లాలో మంజూరైన నాలుగు మండలాల్లోనూ ఒక్క ఆసుపత్రి నిర్మాణం కూడా సాగలేదు. మొగల్తూరు మండలంలోని 17 గ్రామ పంచాయతీలకు గానూ కెపిపాలెం నార్త్, సౌత్, పేరుపాలెం నార్త్, సౌత్ గ్రామ పంచాయతీలు నరసాపురం మండలం తూర్పుతాళ్ళు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉండగా మిగిలిన 14 గ్రామ పంచాయతీలకు సంబంధించి మొగల్తూరు ఆరోగ్య కేంద్రం పర్యవేక్షణలో వైద్య సేవలు అందిస్తున్నారు. దీంతో వైద్య సేవలకు దూరంగా ఉన్న కాళీపట్నం రెవెన్యూ గ్రామ పరిధి కొత్తోట, కాళీపట్నం పడమర, తూర్పు, జగన్నాథపురం, పాతపాడు, కోమటితిప్ప గ్రామాల్లో వైద్య సేవలు మరింత చేరువ చేసేందుకు తలపెట్టిన కాళీపట్నం ఆసుపత్రి నిర్మాణానికి గ్రామస్థులు ముందుకు వచ్చారు. అందరికీ అనువైన ప్రాంతంలో ఉన్న సుమారు 20 సెంట్లు ప్రభుత్వ భూమిని ఆనుకుని మరో 45 సెంట్లు ఆసుపత్రికి స్థలం ఇచ్చేందుకు గ్రామస్థులు ముందుకు రావడంతో స్థల సేకరణ చేశారు. ప్రభుత్వం మారినా, ప్రజాప్రతినిధులు మారినప్పటికీ ఆసుపత్రి నిర్మాణం నోచుకోకపోవడంతో శివారు ప్రాంత ప్రజలు ఆవేదన చెందుతున్నారు. నిర్మాణ ప్రక్రియను గతంలో ఆర్అండ్‌బి పర్యవేక్షణ నుంచి చేపట్టాలని ఉత్తర్వులు ఉండగా ప్రస్తుతం వైద్య ఆరోగ్యశాఖ నిర్మించే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినట్టు తెలిసింది. అయితే నిర్మాణంలో జాప్యం చోటు చేసుకోవడంతో కేంద్ర ప్రభుత్వ నిధులు వెనక్కి వెళ్ళాయి. వాటిని రప్పించాల్సి ఉన్నది. ఇక జిల్లాలో పైనాలుగు మండలాల్లోనూ స్థల సేకరణ సమస్యతో ఆసుపత్రులు నిర్మాణం సాగలేదు. కూటమి పాలనలో నైనా ఆసుపత్రుల నిర్మాణాలు పూర్తి చేసి సర్కారు వైద్యం శివారున ఉండే ప్రతి పేదవాడికి అందించేలా చర్యలు తీసుకోవాలని తీర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


జగన్ ఫ్లెక్సీని దహనం చేస్తున్న యాదవ సంఘం నాయకులు

యాదవులకు జగన్ క్షమాపణ చెప్పాలి

ఏలూరు ఫైర్ స్టేషన్ సెంటర్లో జగన్ ఫ్లెక్సీ దహనం

ఏలూరు రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): యాదవ, బీసీ సంఘాల నాయకులు మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై భగ్గుమన్నారు. మాజీ ఐఏఎస్ అధికారి బీసీ కులానికి చెందిన కృష్ణయ్య యాదవ్, ఐపీఎస్ అధికారి గోపీనాథ్ జెట్టిపై జగన్ అనుచిత వ్యాఖ్యలపై యాదవ యువ సమితి ఏలూరు జిల్లా అధ్యక్షుడు కాట్రు బాలకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్లో శనివారం జగన్ ఫ్లెక్సీని దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాట్రు బాలకృష్ణ మాట్లాడుతూ నిజాయితీగల అధికారి గోపీనాథ్ జెట్టిని, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కృష్ణయ్య యాదవ్‌ను వాడు.. వీడు అని సంబోధించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. తక్షణం యాదవులకు జగన్ క్షమాపణ చెప్పాలని లేకుంటే ఆయనను రోడ్డుపై తిరగనివ్వమని హెచ్చరించారు. తాను చేసిన అక్రమాలు బయట పెడుతున్నారని తట్టుకోలేక జగన్ అవాకులు చవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ పెనుబోయిన మహేష్ యాదవ్ మాట్లాడుతూ జగన్‌ను ప్రజలు ఛీకొట్టి 11 సీట్లకే పరిమితం చేసినా అహంకారం తగ్గలేదని, తక్షణం బీసీలకు, యాదవులకు క్షమాపణ చెప్పకుంటే బుద్ధి చెప్తామని హెచ్చరించారు. యాదవ సంఘం నాయకులు పి. మహేష్ యాదవ్, టి. జమలయ్య, పి. శ్రీనివాస్, ఎన్ లక్ష్మణ్, మన్నే పోతురాజు, మల్లిపూడి రాజు, కొలుసు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల: బీసీ అధికారులైన విశాఖ రేంజ్ డీఐజీ, సీనియర్ ఐపీఎస్ గోపీనాథ్ జట్టి, మాజీ ఐఏఎస్ కృష్ణయ్యపై మాజీ సీఎం జగన్ అనుచిత వ్యాఖ్యలను యాదవ సంఘ నేతలు ఖండించారు. స్థానిక యాదవ కల్యాణ మండప ఆవరణలో శనివారం జరిగిన సమావేశంలో జిల్లా యాదవ సంఘ కార్యదర్శి కూరాకుల బుజ్జి మాట్లాడుతూ నిజాయితీ గల యాదవ అధికారులపై చేసిన వ్యాఖ్యలను జగన్ వెంటనే వెనక్కి తీసుకుని వారికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసారు. సంఘ నేతలు ములకాల రాంబాబు, పంచం దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కూరాకుల బుజ్జి

కోటి రూపాయలకు టోకరా..!

» డ్వాక్రా సభ్యులను బురిడీ కొట్టించిన యానిమేటర్ » బాధితులు లబోదిబో..


బ్యాంకు బయట చర్చించుకుంటున్న బాధితులు

ఆకివీడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆకివీడుకు చెందిన డ్వాక్రా రిసోర్స్ పర్సన్ (యానిమేటర్) సభ్యులను లక్షల్లో మోసం చేసినట్టు పత్రికల్లో వచ్చిన వార్తలతో లీడర్లు, సభ్యులు షాక్‌కు గురయ్యారు. దీంతో డ్వాక్రా మహిళలు తమ బ్యాంకులకు వెళ్ళి ఖాతాలకు సంబంధించి స్టేట్‌మెంట్లు తీసుకొని ఎంత మోసపోయామో తెలుసుకొని లబోదిబోమంటున్నారు.

ఆకివీడు సంతమార్కెట్‌కు చెందిన డ్వాక్రా రిసోర్స్ పర్సన్ ఎల్.సుధ తమ లీడర్లు, సభ్యులను కోటి రూపాయల మేర బురిడీ కొట్టించిందని తెలుస్తోంది. సుధకు 36 గ్రూపులున్నాయి. ఈ గ్రూపులకు సంబంధించిన నలుగురైదురు ఫొటోలు మార్చి సంతకాలు ఫోర్జరీ చేసి బ్యాంకు అధికారుల ద్వారా ఖాతాలో నగదు వేయించుకొని తరువాత వాళ్ళతో ఫోన్ పే ద్వారా ట్రాన్స్‌ఫర్ చేయించుకొనేదని తెలుస్తుంది. ఇలా పలు దఫాలుగా చేసి రూ. 96లక్షలు తమ సొంత ప్రయోజనాలకు వాడుకున్నట్లు సమాచారం. సుధ ఉండిలో చెప్పుల దుకాణం, స్థలం కొనుగోలు చేయడమే కాకుండా విహార యాత్రలు కూడా చేసిందని వినికిడి. సంఘం సభ్యులు రుణాలు తీసుకోకపోయినా లోన్ చెల్లించాలని బ్యాంకు నుంచి సమాచారం రావడంతో ఖంగుతిన్నారు. ఈ విషయంపై యానిమేటర్‌ను లీడర్లు, సభ్యులు నిలదీస్తే పురుగుమందు తాగి తన చావుకు మీరే కారణమని బెదిరించిందని బాధితులు తెలిపారు. దీంతో వారు ప్రజా ప్రతినిధులు దగ్గరకు వెళ్ళగా ఆమెను పిలిచి మాట్లాడగా రూ.96లక్షలు డ్రా చేసి వాడుకున్నానని, ఇప్పుడు తన దగ్గర రూ.17లక్షలు ఉన్నాయని తెలపడంతో ముందుగా ఆ నగదు బ్యాంకులో జమ చేయాలని ఆదేశించడంతో జమ చేసినట్లు సమాచారం. అంతే కాక సుధకు ఒత్తిడి పెరగడంతో ఫోన్ స్విచ్ ఆఫ్ చేసినట్టు తెలుస్తోంది.

మెప్మా పీడీ ఆదేశాల మేర జిల్లా అధికారులు మోహన్, నానిబాబు ఆకివీడులోని కార్యాలయానికి వచ్చి సీవో జయకృష్ణను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పలు గ్రూప్‌ల మహిళలు వచ్చి తమ ఆవేదన వెలి బుచ్చుతున్నారని మెప్మా సీవో జయకృష్ణ తెలిపారు.

ఆకివీడు యూనియన్ బ్యాంకులో యానిమేటర్ ద్వారా లీడర్లకు, సభ్యులకు అన్యాయం జరిగిందని భీమవరం కార్యాలయానికి తెలియడంతో శనివారం తాను వచ్చానని డిప్యూటీ రీజనల్ జిల్లా అధికారి సత్యనారాయణ మీడియాకు తెలిపారు. డ్వాక్రా ఖాతాలు పరిశీలిస్తున్నామని, నివేదికలను ఉన్నతాదికారులకు అందజేస్తామన్నారు. బ్యాంకు మేనేజర్‌గా యండగండి నాగరమేష్ ఉన్నారు. ఆయనకు ముందు పనిచేసిన మేనేజర్‌ను కూడా పిలుస్తున్నట్టు సమాచారం.


బ్యాంకులో డ్వాక్రా ఖాతాలు పరిశీలించి చర్చిస్తున్న బ్యాంకు, మెప్మా అధికారులు

ఘోరంగా మోసపోయాం



వాసవి గ్రూప్‌లో పదిహేనేళ్ళ నుంచి యానిమేటర్, తాము కుటుంబ సభ్యుల్లా కలిసిమెలిసి ఉంటున్నాం. ఈ ఏడాది మార్చి నెలలో రూ.5 లక్షలు నగదు బ్యాంకు ద్వారా తమ గ్రూప్‌లో పడింది. ఈ విషయం యానిమేటర్ నవంబరు వరకు తమకు తెలియచేయలేదు. డబ్బు అవసరమని సుధను అడుగుతుంటే అదిగో ఇదిగో అంటుండడంతో అనుమానం వచ్చి బ్యాంకు వెళ్ళి స్టేట్‌మెంట్ తీసుకొంటే అసలు విషయం బయట పడింది. పది రోజుల్లో తమ నగదు జమ చేస్తానని చెప్పింది.

-కొల్లిపర లలితాకుమారి, డ్వాక్రా లీడర్, ఆకివీడు

ఫోన్ స్విచ్చాఫ్.. మనిషి అదృశ్యం



యానిమేటర్ సుధకు ఫోన్‌చేస్తే స్విచ్చాఫ్ వస్తుంది. ఇంటికి వెళ్ళితే ఎవరూ లేరు. తనను బెదిరిస్తే పురుగుమందు తాగి తన చావుకు కారణమని పలువురితో అన్నట్లు తెలిసింది. దీంతో ఆమెపై ఫిర్యాదు చేయడానికి భయపడుతున్నారు. తమ గ్రూప్ ద్వారా మనిషికి రూ.50 వేలుతో పాటు వడ్డీ రూ.50 వేలు అయిందని ఇప్పుడు ఈ డబ్బులు ఎవరు కడతారు. గ్రూప్‌లో కాయ కష్టం చేసుకొని బతికే వాళ్ళు చాలా మంది ఉన్నారు. ఈ నగదే కా కుండా పలు అమౌంట్లలో కూడా తేడాలున్నట్లు తెలుస్తుంది.

-మొవ్వా సుధారాణి, సభ్యురాలు, ఆకివీడు


కొమ్ముగూడెం వద్ద సొసైటీ ఉద్యోగుల నిరసన

సహకార ఉద్యోగుల నిరసన

ఏలూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తమ అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సొసైటీల్లో పనిచేసే ఉద్యోగులు జిల్లా వ్యాప్తంగా నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 258 సొసైటీల్లో 1400 మంది ఉద్యోగులు, సిబ్బంది ఆందోళనకు ఉపక్రమించారు. నెలరోజుల పాటు దశలవారీగా ఆందోళనలకు పిలుపునిచ్చిన ఉద్యోగులు తమ విధులకు హాజరవుతూనే నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. విధులకు ఏ మాత్రం ఆటంకం కలిగించకుండా అన్నిచోట్ల ఆందోళనల్లో సిబ్బంది పాల్గొన్నారు.

జడ్జి పర్వేజ్‌కు పీహెచ్‌డీ


న్యాయమూర్తి పర్వేజ్‌కు పీహెచ్‌డీ అందిస్తున్న రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం

ఏలూరు క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా కోర్టు ఆవరణ లోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు జడ్జి ఎస్‌కె ఎండీ అబూ తాలీబ్ పర్వేజ్‌కు పీహెచ్ డీని ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం శనివారం ప్రదానం చేశారు. ఆచార్య నాగార్జున వర్సిటీలో న్యాయ శాస్త్రంలో పర్వేజ్ పీహెచ్‌డీ చేశారు. వర్శిటీ పరిశోధనా పర్యవేక్షకులు డాక్టర్ ఎ. గురవయ్య పర్యవేక్షణలో పారా లీగల్ వలంటీర్లు, న్యాయ విద్యార్థులు గ్రామీణ ప్రజలకు చట్టపరమైన అంశాలపై అవగాహన కల్పించడంలో ఎదురవుతున్న క్లిష్టమైన అంశాలపై విశ్లేషణను గుంటూ రు జిల్లాపై పరిశోధన చేసినట్టు ఆ పరిశోధన విభాగం సమన్వయకర్త డాక్టర్ పి. సుధాకర్ తెలిపారు. ఆచార్య నాగార్జున వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం ఈ మేరకు పీహెచ్‌డీని జడ్జి పర్వేజ్‌కు అందించి అభినందించారు.

డాక్టర్ శ్రీనివాసరాజుకు ఐఎంఏ పురస్కారం



ఏలూరు అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జాతీయ పురస్కారం-2025కి ఏలూరుకు చెందిన వైద్య నిపుణుడు డాక్టర్ సీహెచ్. శ్రీనివాసరాజు ఎంపికయ్యారు. వివరాలను ఐఎంఏ రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు శనివారం స్థానిక మీడియాకు తెలియజేశారు. వైద్యవృత్తిలో అత్యుత్తమ సేవలందించేవారికి ఐఎంఏ జాతీయస్థాయిలో ఏటా డాక్టర్ జ్యోతి ప్రసాద్ గంగూలీ స్మారక జాతీయ పురస్కారం అందజేస్తుందని, ఈ పురస్కారానికి ఈ ఏడాది డాక్టర్ శ్రీనివాసరాజును ఎంపిక చేస్తూ ఐఎంఏ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సర్వరిదత్తా శనివారం ప్రకటించారని వివరించారు. ఈ పురస్కారాన్ని అహ్మదాబాద్(గుజరాత్)లో ఈ నెల 27న నిర్వహించనున్న ఐఎంఏ నాట్కాన్, 86వ కేంద్ర మండలి వార్షిక సమావేశంలో డాక్టర్ శ్రీనివాస రాజుకు అందజేస్తారని తెలిపారు. ఈ పురస్కారానికి రాష్ట్రం నుంచి ఎంపికైన తొలి వైద్యుడిగా శ్రీనివాసరాజు గుర్తింపు పొందారన్నారు. అవార్డుకు ఎంపికైన ఆయనను ఐఎంఏ నాయకులు డాక్టర్ బసవరాజు, విజయ భాస్కరరెడ్డి, ప్రసాదరావు, ప్రసన్నకుమార్, సుబ్బారావు తదితరులు అభినందించారు.


అమ్మపాలెంలో బాధితురాలి ఇంటి పరిసరాలను పరిశీలిస్తున్న ర్యాపిడ్ రెస్పాన్సిబిలిటీ టీం ప్రతినిధులు

మరొకరికి స్క్రబ్ టైఫస్!

» నూజివీడు నుంచి విజయవాడ జీజీహెచ్‌కు తరలింపు

» మూలాలు విశ్లేషించేందుకు ఆర్‌ఆర్‌టీల ఏర్పాటు

ఏలూరు అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్క్రబ్ టైఫస్ పాజిటివ్ కేసు మరొకటి నమోదైంది. తాజాగా నమోదైన కేసుతో జిల్లాలో ముగ్గురు బాదితులు స్క్రబ్ టైఫస్ బారినపడినట్టు అధికారికంగా రుజువైంది. నూజివీడుకు చెందిన ఓ వ్యక్తి(35) తాపీ పనుల నిమిత్తం రోజూ ఏలూరు రాకపోకలు సాగిస్తుంటాడు. తీవ్ర జ్వరం, మలబద్దకం సమస్యతో గత నెల 29న నూజివీడు ఏరియా ఆసుపత్రిలో చేరాడు. ఇతనికి కిడ్నీలో రాళ్ల సమస్య కూడా ఉంది. చికిత్స అందిస్తున్నప్పటికీ జ్వరం అదుపులోకి రాకపోవడంతో శుక్రవారం రాత్రి ఎలీసా టెస్టు నిర్వహించగా స్క్రబ్ టైఫస్ పాజిటివ్ నిర్ధారణైంది. దీంతో మెరుగైన చికిత్స నిమిత్తం అతనిని శనివారం ఉదయం విజయవాడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం రోగి ఆరోగ్యస్థితి నిలకడగానే ఉందని, ఆందోళన చెందనక్కర్లేదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు వెల్లడించాయి. బాధితుని ఇంటి ఆవరణలోనే పశువుల షెడ్డు మురుగుతో ఉండటంతో నల్లిపురుగు వ్యాప్తిచెంది ఉండవచ్చునని ప్రాథమికంగా ఓ అంచనాకు వైద్యవర్గాలు వచ్చినట్టు సమాచారం. ఇప్పటికే టి.నరసాపురానికి చెందిన ఓ పురుషునికి, పెదవేగి మండలం అమ్మపాలెంకు చెందిన ఓ మహిళకు స్క్రబ్ టైఫస్ నిర్ధారణకాగా, తాజాగా మరొకరు నల్లిలాంటి ఓ రకం పురుగుకాటుకు గురయ్యారు. కాగా ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న అమ్మపాలెంకుచెందిన మహిళకు ఆరోగ్యం కుదుటపడటంతో శనివారం డిశ్చార్జి చేశారు.

జిల్లాల వారీగా ఆర్‌ఆర్‌టీ

రాష్ట్రంలో స్క్రబ్ టైఫస్ బాధితుల సంఖ్య పెరుగుతుండటంతో సంబంధిత రోగులు నివసించే ఇళ్లవద్దకేవెళ్లి మూలాలను అన్వేషించి, విశ్లేషించేందుకు జిల్లాల వారీగా ర్యాపిడ్ రెస్పాన్సిబిలిటీ టీం(ఆర్‌ఆర్‌టీ)లను నియమించింది. ఈ టీంలో ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, జనరల్ మెడిసిన్ వైద్యుడు, పీడియాట్రిక్స్ వైద్యుడు, కమ్యూనిటీ మెడిసిన్ వైద్యనిపుణుడు, జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఐడీఎస్పీ (అంటువ్యాధులు/కీటకజనిత వ్యాధుల) విభాగం జిల్లా ఎపిడమాలసిస్టు ఉంటారు. ఈ బృందం శనివారం పెదవేగి మండలం అమ్మపాలెంలో స్క్రబ్ టైఫస్ బారిన పడిన మహిళ ఇంటిని సందర్శించింది. బాధితురాలి కుమార్తె నుంచి వివరాలను అడిగి తెలుసుకోవడంతోపాటు, ఇంటి పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించింది. ఇంటి ప్రాంగణంలో చెత్తాచెదారం, పొదలతో ఉన్నట్టు గమనించారు. మంచాన్ని, ఆవరణలోని నీటితొట్లు పరీక్షించారు. నివేదికను ప్రభుత్వానికి పంపించనున్నారు. జిల్లాకు నియమించిన ఈ బృందంలో ఏలూరు ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సావిత్రి, వైస్‌ప్రిన్సిపాల్/మైక్రోబయాలజీ హెచ్‌వోడి డాక్టర్ శశిధర్, ఎస్పీడీ విభాగం ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నరేంద్రకృష్ణ, తదితరులున్నారు.

గుండెపోటుతో భక్తుడి మృతి


మహేశ్ మృతదేహం

ద్వారకాతిరుమల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా చినవెంకన్న క్షేత్రానికి వచ్చిన ఓ భక్తుడు గుండెపోటుతో మృతి చెందాడు. విజయవాడకు చెందిన రెడ్డిపల్లి మహేష్(55) శనివారం ఉదయం శ్రీవారి దర్శనానికి ద్వారకాతిరుమలకు వచ్చాడు. కేశఖండనశాల వద్ద తలనీలాలు సమర్పించి, టాయిలెట్‌కని సమీపంలో ఉన్న ఖాళీ స్థలానికి వెళ్లాడు. అక్కడ గుండెపోటురావడంతో కుప్పకూలిపోయాడు. ఎవరూ ఆ ప్రాంతంలో లేకపోవడంతో ఈ ఘటనను గుర్తించలేదు. అయితే మధ్యాహ్న సమయానికి అటుగా వచ్చిన కొందరు భక్తులు ఎవరో పడిపోయి ఉన్నట్లు గమనించి సెక్యూరిటీకి సమాచారం అందించారు. వారు అంబులెన్స్‌లో స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లగా అక్కడున్న వైద్య సిబ్బంది పరీక్షించి అతను మృతి చెందాడని చెప్పారు. దీంతో అతని వద్దఉన్న ఫోన్ నెంబరు ఆధారంగా మృతుని కుమారునికి ఫోన్ చేసి విషయం చెప్పారు. మృతుడు మహేష్ విజయవాడలో ముఠాకూలీ పనులు చేస్తుంటాడని తెలిసింది.

విద్యుదాఘాతంతో బోర్ మెకానిక్ మృతి

ద్వారకాతిరుమల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పొలంలో బోరుకు మరమ్మతులు చేస్తున్న మెకానిక్ విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. మండలంలోని లక్ష్మీపురంకాలనీకి చెందిన పెచ్చెట్టి పెద్దిరాజు (40) బోరు మెకానిక్‌గా జీవనాన్ని సాగిస్తున్నాడు. ఈక్రమంలో ఉదయం రైతు రామ్మోహన్‌రావు వ్యవసాయక్షేత్రంలో బోరు మరమ్మతుకు గురికావడంతో దానిని రిపేరు చేసే క్రమంలో ప్రమాదవశాత్తు 12కెవి లైను మీద బోరుపైపు భాగం వెళ్లి పడింది. దీంతో దాన్ని పట్టుకుని ఉన్న పెద్దిరాజు షాక్‌కు గురయ్యాడు. వెంటనే స్థానికులు అతడిని ద్వారకాతిరులమల పీహెచ్‌సీకి తరలించగా పరీక్షించిన వైద్యులు ప్రవీణ్‌కుమార్ మృతిచెందినట్లు ధ్రువీకరించారు.

రైళ్లలో ఆకస్మిక తనిఖీ

గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురి అరెస్టు

అరెస్టయిన వారిలో డిగ్రీ చదివే విద్యార్థిని

ఏలూరు క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రైళ్లల్లో గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురిని ఏలూరు రైల్వే పోలీసులు ఈనెల 5వ తేదీ రాత్రి అరెస్టు చేశారు. జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు ఏలూరు పెద్ద రైల్వే పోలీస్ స్టేషన్‌లో ప్లాట్ ఫామ్ ఒకటి వద్ద తనిఖీలు నిర్వహిస్తున్నారు. రైల్వే ఎస్‌ఐ కె శివన్నారాయణ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు నిర్వహించగా బ్యాగ్‌లతో ఉన్న ఒక యువతి, ఒక యువకుడు, ఒక మహిళ అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని తనిఖీలు చేశారు. వారి వద్ద 34.50 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ 17 లక్షల 33 వేల 250 రూపాయలు ఉంటుందని గుర్తించారు. అరెస్టయిన నిందితులు కర్నాటక రాష్ట్రం హస్సాన్ జిల్లా బెల్లూరు గ్రామానికి చెందిన హెచ్‌ఎస్ రవి ప్రస్తుతం కాకినాడలోని సర్పవరం జంక్షన్ రమణయ్యపేట మార్కెట్ వద్ద ఉన్న ఇంద్ర కాలనీలో నివాసం ఉంటున్నాడు. రెబకాగణేష్ (18) డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. చెన్నైలోని తమిళనాడుకు చెందిన ఈ యువతిని, మరో మహిళ చెన్నైనకు చెందిన మునియమల్ మనోగరామ్ అనే వృద్ధురాలిని అరెస్టు చేశారు. వీరు కాకినాడ నుంచి గంజాయిని రైలులో తీసుకుని ఆ బ్యాగ్‌లతో రైలులో ప్రయాణిస్తూ చెన్నైలోని సెంట్రల్ రైల్వేస్టేషన్‌కు ముందుగానే అక్కడ సిద్ధంగా ఉన్న గంజాయి కొనుగోలు దారులకు ఆ బ్యాగ్‌లను రైలు నుంచి విసిరివేస్తారు. వీరి నుంచి రెండు సెల్‌ఫోన్లను కూడా స్వాధీనం చేసుకున్నారు.


పోలీసులు అరెస్టు చేసిన గంజాయి నిందితులు


ఆవుల్ని లారీలో కుక్కిపెట్టిన దృశ్యం

అక్రమంగా పశువుల తరలింపు

పట్టుకున్న పోలీసులు

జీలుగుమిల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై గస్తీ నిర్వహిస్తున్న పోలీస్‌లు అక్రమంగా పశువుల్ని తరలిస్తున్న లారీని పట్టుకున్నారు. జీలుగుమిల్లి సమీపంలోని రమణక్కపేట వద్ద రాత్రి సమయంలో ఒరిస్సా నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా ఒక లారీలో పశువుల్ని తరలిస్తుండగా అనుమానం వచ్చి తనిఖీ చేయగా పశుల్ని తరలిస్తున్నట్లు గుర్తించారు. లారీని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.


దొంగ నుంచి స్వాధీనం చేసుకున్న సామగ్రిని చూపుతున్న రైల్వే పోలీసులు

దొంగ అరెస్టు

భీమవరం క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది అక్టోబర్ నెలలో 1, 17వ తేదీల్లో ధర్మవరం ఎక్స్‌ప్రెస్‌లో దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని అరెస్ట్ చేసి అతని వద్ద విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు భీమవరం గవర్నమెంట్ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. శనివారం రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. నరసాపురం మండలం చిన్న మామిడిపల్లి గ్రామానికి చెందిన యర్రంశెట్టి సతీష్ ధర్మవరం రైలులో ల్యాప్‌టాప్, రూ.5 వేల నగదు, బ్యాంక్ పాస్‌బుక్, 6 సెల్‌ఫోన్లు దొంగిలించడంతో బాధితులు ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి యర్రంశెట్టి సతీష్‌ను అరెస్ట్ చేశామన్నారు. అతని వద్ద నుంచి చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఎక్సైజ్ దాడులు: ఇద్దరిపై కేసు

చింతలపూడి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి నగర పంచాయతీ నాగిరెడ్డిగూడెం గ్రామంలో శనివారం డ్రోన్ ద్వారా దాడులు, తనిఖీలు నిర్వహించారు. వడిత్యా లక్ష్మీ నుంచి పది లీటర్ల సారా స్వాధీనం చేసుకుని వడిత్యా మణి వద్ద పది లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. వీరిరువురిపై కేసు నమోదు చేసినట్టు సీఐ పి.అశోక్ తెలిపారు.

హత్య కేసులో నిందితుల ఇళ్లపై దాడి


దగ్ధమైన కారును పరిశీలిస్తున్న పోలీసులు

భీమడోలు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పూళ్ళ గ్రామంలో వివాహేతర సంబంధం నేపథ్యంలో జరిగిన పాతల నాగరాజు హత్య గ్రామంలో చిచ్చు రేపింది. మృతుడికి సానుభూతిపరులైన గ్రామస్థులు నిందితుల ఇళ్లపై దాడులకు దిగారు. సామగ్రిని ధ్వంసం చేశారు. పూళ్ళ గ్రామంలో ఈనెల 2వ తేదీన పాతల నాగరాజును కాండ్రు ఇస్సాకు మరో ముగ్గురు కత్తులతో దాడి చేసి హత్య చేశారు. నేపథ్యంలో నిందితులు నలుగుర్ని భీమడోలు పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. అయితే మృతుడు నాగరాజుకి సానుభూతి పరులైన గ్రామస్థులు 5వ తేదీ అర్ధరాత్రి నిందితుడు కాండ్రు ఇస్సాకు, ఇతని సోదరుడు రాజు ఇళ్ళపై దాడి చేశారు. ఇంట్లో సామగ్రిని ధ్వంసం చేసి బయటపడేశారు. రోడ్డుపైన ఉన్న కారుకు, కిళ్ళీ కొట్టు, కోళ్ళ షెడ్‌లకు నిప్పంటించారు. పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేశారు.

19 మంది అరెస్టు

ఇళ్లపై దాడి చేసి సామగ్రి ధ్వంసం చేసి షెడ్‌లకు నిప్పంటించిన 19 మందిని అదుపులోకి తీసుకున్నట్లు భీమడోలు పోలీసులు తెలిపారు. వీరిలో బొల్లారపు పవన్‌రాజ్ కుమార్ మరో 18 మంది ఉన్నట్లు సీఐ విల్సన్ తెలిపారు. ఘటన ప్రదేశాలను సీఐతో పాటు ఎస్‌ఐ మదీనా బాషా పరిశీలించారు.

జాతీయ రహదారిపై మంటల్లో కారు దగ్ధం

హనుమాన్‌జంక్షన్ రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై వీరవల్లి బైపాస్ వద్ద కారులో మంటలు చెలరేగి దగ్ధమైన ఘటన శనివారం ఉదయం జరిగింది. వీరవల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జంగారెడ్డిగూడెం నుంచి విజయవాడ వెళుతున్న కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో అందులో ప్రయాణిస్తున్నవారు అప్రమత్తమై రోడ్డు పక్కన నిలిపి బయటకు పరుగులు తీశారు. విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి బయలుదేరిన జంగారెడ్డిగూడెం మండలం తాడువాయికి చెందిన ఏడుగురు (ఐదుగురు మహిళలు, ఇద్దరు పురుషులు) వీరవల్లి బైపాస్‌పై కారు ఆగిపోవడంతో పాటు పొగ రావడంతో భయంతో దిగిపోయి రోడ్డు పక్కకు వెళ్లిపోయినట్టు తెలిపారు. స్థానికుల సమాచారంతో హనుమాన్‌జంక్షన్ ఫైర్ ఆఫీసర్ అమరేశ్వరరావు సిబ్బందితో కలిసి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే కారు మొత్తం దగ్ధమైంది. ఎస్సై బాధితులను వేరే వాహనంలో తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నల్లజర్ల, డింబరు 6 (ఆంధ్రజ్యోతి):నల్లజర్ల మండలం పుల్లలపాడు బైపాస్ రోడ్డుపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏలూరు జిల్లా చింతలపూడి మండలం ఎర్రంపల్లి గ్రామానికి చెందిన శాయలి శివరామకృష్ణ(20)అక్కడక్కడే మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. శివరామకృష్ణ ఏలూరు సీఆర్‌రెడ్డి కళాశాలలో చదువుకుంటున్నాడు. ద్వారకాతిరుమల వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని తిరుగు ప్రయాణంలో నల్లజర్ల వైపు వస్తుండగా పుల్లలపాడు వద్ద గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొంది. శివరామకృష్ణ తలకు బలమైన గాయం కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై మోహన్‌రావు తెలిపారు.

ట్రిపుల్ ఐటీలో విద్యార్థిని అదృశ్యం

నూజివీడు టౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో పీయూసీ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని అదృశ్యం అయిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఏలూరు జిల్లా తడికలపూడి గ్రామానికి చెందిన మైనర్ విద్యార్థిని నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్‌లో భాగంగా పీయూసీ ప్రథమ సంవత్సరం చదువుతోంది. క్యాంపస్‌లోని కే4 హాస్టల్లో వసతి పొందుతున్న ఆమె శుక్రవారం రాత్రి నుంచి కనిపించకపోవడంతో నూజివీడు పట్టణ పోలీసులకు ట్రిపుల్‌ఐటీ అధికారులు ఫిర్యాదు చేశారు. ఈమేరకు నూజివీడు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతదేహం గుర్తింపు

పోలవరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పోలవరం మండలం పట్టిసీమ ఫెర్రీ రేవులో గుర్తు తెలియని మృతదేహాన్ని శనివారం మృతుని బంధువులు గుర్తించారు. గురువారం పట్టిసీమ ఫెర్రీ రేవులో గుర్తు తెలియని మృతదేహాన్ని పోలీసులు కనుగొని పోలవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన అనంతరం మృతుని వివరాల కోసం ఫొటోలు సామాజిక ప్రసార మాధ్యమాలు వాట్సప్ గ్రూపుల ద్వారా ప్రచారం చేయడంతో సమాచారం మృతుని బంధువులకు చేరి పోలవరం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి చేరుకుని మృతదేహాన్ని గుర్తుపట్టారు. మృతుడు తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం రాజంపాలెం గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త కొప్పుల సాయిరాం(30) గా గుర్తించారు. గత ఐదు రోజుల క్రితం వ్యక్తిగత పనిపై పోలవరం వచ్చిన మృతుడు ప్రమాదవశాత్తూ గోదావరిలో పడి మృతి చెందినట్లుగా భావిస్తున్నామని మృతుని తల్లి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

భీమేశ్వరస్వామి హుండీల ఆదాయం రూ.2.55 లక్షలు

భీమవరంటౌన్, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి):భీమవరం పట్టణంలోని భీమేశ్వర స్వామి దేవస్థానంలో హుండీలను శనివారం తెరిచి లెక్కించగా 9 నెలలకు రూ.2,55,330 ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో తోట శ్రీనివాసరావు తెలిపారు., స్వామి వారి ఉపాలయం రాధాకృష్ణ స్వామి ఆలయంలో హుండీలను తెరిచి లెక్కించగా మూడేళ్లకు రూ.57,620 ఆదాయం వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమం కొణితివాడ వేణుగోపాలస్వామి దేవస్థానం ఈవో కర్రి శ్రీనివాసరావు పర్యవేక్షణలో, దేవాలయ చైర్మన్ గనిరెడ్డి త్రినాథ్, ధర్మకర్తలు ఉన్నారు.

'13న లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి'

తణుకు రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఈనెల 13వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని తణుకు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ డి.సత్యవతి తెలిపారు. తణుకు కోర్టు సముదాయంలో నిర్వహించే లోక్ అదాలత్‌లో రాజీ చేసుకునేందుకు వీలున్న క్రిమినల్, చెక్ బౌన్స్, ఎక్సైజ్ కేసులు, భార్య, భర్తల కుటుంబ తగాదా కేసులు, బ్యాంక్ రుణాల కేసులు, ప్రామిసరీ నోటు కేసులు, అన్ని రకాల సివిల్ కేసులను రాజీ చేసుకోవడానికి ఇది చక్కని అవకాశమని సూచించారు.

అంగన్‌వాడీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి : ఆరిమిల్లి

తణుకు రూరల్/ఇరగవరం/అత్తిలి, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలులో భాగంగా అంగన్‌వాడీల అభివృద్ధికి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ చెప్పారు. శనివారం తణుకులోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఆరుగురు మిని అంగన్‌వాడీ కార్యకర్తలకు మెయిన్ అంగన్‌వాడీ కార్యకర్తలుగా పదోన్నతి పొందిన సందర్భంగా వారికి నియామక పత్రాలను అందజేశారు. ఇరగవరం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తెలుసుకున్నారు. పలు సమస్యలను అక్కడికక్కడే అధికారుల సమక్షంలో పరిష్కరించారు. ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ సుందరరాజు, అధికారులు, కూటమి నాయకులు, పాల్గొన్నారు. అత్తిలి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ వారు కొమ్మర గ్రామంలో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శిరగాని నాగేశ్వరరావు అధ్యక్షతన ఎమ్మెల్యే రాధాకృష్ణ ప్రారంభించి మాట్లాడారు. వైద్య శిబిరం దాత ముదునూరి బాలకృష్ణంరాజు, క్లబ్ అధ్యక్షుడు శిరగాని నాగేశ్వరరావు, సత్తి బాపూజీ రెడ్డి, కోశాధికారి వర్ధినీడి వెంకటేశ్వరరావు, దాసం బాబ్జీ, సీతాల వెంకటనారాయణ, ప్రవీణ్‌రాయ్, ఉలుసు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని చాటాలి : బొలిశెట్టి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని చాటాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కోరారు. నారాయణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించే ఎస్‌పీఎల్ స్పోర్ట్స్ మీట్ వాకర్స్ అసోసియేషన్ గ్రౌండ్‌లో శనివారం క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థి దశ నుంచి క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక, మానసిక పరిపక్వతకు దోహదపడుతుందన్నారు. మున్సిపల్ కమిషనర్ ఎంఏ సుబాబు, బీజేపీ జిల్లా మీడియా ఇన్‌చార్జి నరిసే సోమేశ్వరరావు, నారాయణ విద్యాసంస్థల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : బాబ్జి



అర్జీలను స్వీకరిస్తున్న వలవల బాబ్జి

పెంటపాడు, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి):ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయ మని భవన, కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల బాబ్జి అన్నారు. శనివారం స్థానిక పట్టణ టీడీపీ కార్యాలయం వద్ద ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో భాగంగా ప్రజల వద్ద నుంచి సమస్యలపై అర్జీలను స్వీకరించారు. తొలుత అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆకాశపు స్వామి, గొర్రెల శ్రీధర్, పట్నాల రాంపండు, కిలపర్తి వెంకట్రావు, పాతూరి రాంప్రసాద్ చౌదరి, ముత్యాల సత్యనారాయణ, సబ్బిసు కృష్ణమోహన్ పాల్గొన్నారు.

వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలి

తాడేపల్లిగూడెం రూరల్, డిసెంబరు 6.(ఆంధ్రజ్యోతి): వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపి అప్రమత్తం చేయాలని జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి వై.నాగబాబు అన్నారు. తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీ ఆవరణలో వైద్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామంలో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ వైద్యులు శ్రీహర్ష, రూపాదేవి సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సూర్యకాంతం, ఎంపీహెచ్‌ఈవో కిషోర్ సిబ్బంది పాల్గొన్నారు.

వెండితెర మరువలేని మహానటి 'సావిత్రి'

భీమవరంటౌన్, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): వెండితెర మరువలేని మహానటి, నటనకు నిలువెత్తు రూపం సావిత్రి అని కళారంజని నాటక పరిషత్ అధ్యక్షుడు జవ్వాది శ్రీనివాస్ అన్నారు. శనివారం శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో సావిత్రి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరుణ, కోపం, హాస్యం ఇలా ఏ భావాన్నైనా తన కళ్లతోనే పలికించగల అద్భుత కళాకారిణి మహానటి సావిత్రి అని అన్నారు. కార్యక్రమ నిర్వాహకులు అరసవల్లి సుబ్రమణ్యం, చైతన్య భారతి నాటక పరిషత్ సభ్యులు భట్టిప్రోలు శ్రీనివాసరావు, బీజేపీ తూర్పు, పడమట పట్టణ అధ్యక్షుడు వబిలిశెట్టి ప్రసాద్, అడబాల శివ, ఐవీఎల్ వెంకటేశ్వరరావు, మల్లువలస రాము, పడమటి నరసింహమూర్తి, లంకి చిన్ని, గొంతిన శ్రీను పాల్గొన్నారు.

'ఉత్తమ ఫలితాలు సాధించాలి'

తాడేపల్లిగూడెం రూరల్,డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో విద్యార్థులు ప్రభుత్వం అందించే స్టడీ మెటీరియల్‌ను ఉపయోగించుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని సర్పంచ్ బేదపూడి వెంకట సుబ్బలక్ష్మి పేర్కొన్నారు. కృష్ణాయపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం అందించే విజయకేతనం స్టడీ మెటీరియల్‌ను శనివారం విద్యార్థులకు అందించారు. ఉప సర్పంచ్ బేదపూడి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

'సమాజ సేవ ఒక సామాజిక బాధ్యత'

భీమవరంటౌన్, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): సమాజ సేవ చేయడం ఒక సామాజిక బాధ్యత అని తోటివారికి సహకారం అందించడం ఎంతోమందికి స్ఫూర్తిదాయకమని మార్నింగ్ కాఫీ క్లబ్ కన్వీనర్ బొండా రాంబాబు, కో-కన్వీనర్ ఓలేటి శ్రీనివాస్‌గుప్తా, పీఆర్వో భట్టిప్రోలు శ్రీనివాసరావు, కారుమూరి సత్యనారాయణ మూర్తి, గుండు మూర్తి అన్నారు. శనివారం భీమవరంలో కాఫీ మాస్టర్ ఏసు కుటుంబ సభ్యులకు మార్నింగ్ కాఫీ క్లబ్ ఆధ్వర్యంలో కొత్త శ్రీను సహకారంతో 78 కేజీల బియ్యం, కిరణా సరుకులు, సభ్యుల సహకారంతో రూ. 38 వేలు ఆర్థిక సహకారాన్ని అందించారు.. క్లబ్ సభ్యులు కోట్ల నాని, చవ్వా భామ కృష్ణమూర్తి, బంగారు రాము, కారు మూరి కిరణ్, సకల కుమార్, పులవర్తి రామకృష్ణ, గాదె నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మునిసిపాలిటీకి తాళం

(5వ పేజీ తరువాయి)

కార్యాలయ గేట్‌కు తాళం వేసి ఆందోళన చేపట్టారు. సుమారు రెండు గంటల పాటు ఆందోళన సాగడంతో పోలీసులు చేరుకున్నారు. కౌన్సిలర్ జయరాజు రాడ్డుతో తాళం పగలగొట్టి చైర్‌పర్సన్‌తో పాటు వైసీపీ కౌన్సిలర్లంతా కారెక్కేందుకు బయటకు వచ్చారు. కారు వెళ్లనివ్వండా అడ్డుకోవడంతో వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు జోక్యంతో వారంతా కార్యాలయం నుంచి బయటకు వచ్చారు.

సమగ్ర విచారణ చేపట్టాలి

మునిసిపాలిటీలో బాక్స్ టెండర్లు, సీ బిల్లులపై సమగ్ర విచారణ చేపట్టాలని కూటమి కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. కౌన్సిల్ తీర్మానాలు చేసిన పనులు ఎందుకు చేపట్టడం లేదని కమిషనర్ అంజయ్యను నిలదీశారు. 11 నెలల నుంచి ఒక్క పని చేయించుకోలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే పురపాలకానికి చెడ్డ పేరొస్తుందని దిలీప్, సిర్రా కాంతమ్మ అన్నారు. పని చేయని కమిషనర్‌ను ప్రభుత్వానికి సరెండర్ చేయాలని సభ్యులు కోరగా సభ్యులు అంగీకరించారు.

దౌర్జన్యం చేశారు : చైర్‌పర్సన్

తనతో పాటు మహిళా కౌన్సిలర్లపై జనసేన కౌన్సిలర్లు దౌర్జన్యం చేశారని మునిసిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణ అన్నారు. బయటకు వెళ్లనివ్వకుండా నిర్బంధించడం దారుణమని వీసీ నాగిని, కౌన్సిలర్లు ఆడిదెల శ్యామాలలు ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ పార్టీ కార్యాలయంలో వారు విలేకర్లతో మాట్లాడారు. డపింగ్‌యార్డు సమస్యపై సభ్యులంతా కూర్చొని చర్చిద్దామని చెప్పినా వినలేదని, పోడియం వద్దకు వచ్చి మినిట్ బుక్‌లో రాయాలని బలవంతం చేశారాన్నారు. చైర్‌పర్సన్‌తో పాటు మిగిలిన కౌన్సిలర్లను బయటకు వెళ్లకుండా గేటుకు తాళాలు ఎలా వేస్తారని ప్రశ్నించారు. డపింగ్‌యార్డుకు పూర్తి సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. సిర్రా కాంతమ్మ, యర్రా ఉమా, కావలి రామసీత, దుర్గాభావని, పద్మ, కామన బుజ్జి, శ్రీకాంత్, సఖినేటిపల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



తణుకు మున్సిపల్ కార్యాలయం వద్ద అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి



నరసాపురంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న విప్ నాయకర్



తణుకు సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యాంగ ప్రచార వేదిక జిల్లా కన్వీనర్ డీవీవీఎస్ వర్మ



భీమవరంలో మాట్లాడుతున్న రాజ్యాంగ ప్రచార వేదిక రాష్ట్ర నాయకుడు మంతెన సీతారామ్

మహనీయుడు అంబేడ్కర్

- జిల్లావ్యాప్తంగా వర్ధంతి కార్యక్రమాలు
- చిత్రపటాలు, విగ్రహాల వద్ద ఘన నివాళులు

తణుకు రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దేశానికి రాజ్యాంగం ద్వారా మార్గనిర్దేశం చేసిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శనివారం డాక్టర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా తణుకు మున్సిపల్ కార్యాలయం ఎదుట గల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఎంసీ చైర్మన్ కొండేటి శివ, దళిత సంఘాల నాయకులు, కూటమి నాయకులు పాల్గొన్నారు. తణుకులోని వైసీపీ కార్యాలయంలో మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తణుకులోని సురాజ్య భవన్‌లో రాజ్యాంగ ప్రచార వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో డాక్టర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా 'డాక్టర్ అంబేడ్కర్ స్ఫూర్తి-రాజ్యాంగ విలువలు' అనే అంశంపై జిల్లా రాజ్యాంగ ప్రచార వేదిక కన్వీనర్ డీవీవీఎస్ వర్మ మాట్లాడారు. రాజ్యాంగానికి పొంచి వున్న ప్రమాదాన్ని అంబేడ్కర్ 1946లో చేసిన ప్రసంగంలోనే ప్రస్తావించారని చెప్పారు. సామాజిక న్యాయ పోరాట సమితి వ్యవస్థాపకుడు పేరూరి మురళీ కుమార్ రాజ్యాంగ పీఠికను చదివారు. వేదిక కన్వీనర్ డాక్టర్ బి.రమేష్‌చంద్రబాబు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ సంకు మనోరమ, ఎ.అజయకుమారి, సీఐటీయూసీ కార్యదర్శి వీవీ ప్రతాప్, ఏఐటీయూసీ బొద్దాని నాగరాజు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, అడ్డాల సత్యనారాయణ, కరుణాకర్ చౌదరి, డాక్టర్ ముప్పన రఘు, డాక్టర్ వంక రామదాసు, చీకటి శ్రీనివాసరావు, ఆలపాటి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

● భీమవరంటౌన్: డాక్టర్ అంబేడ్కర్ దేశానికి తిరుగులేని రాజ్యాంగాన్ని అందించారని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. భీమవరం అంబేడ్కర్ సెంటర్‌లో ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ భీమవరం మండల శాఖ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. డీఆర్‌వో బి.శివన్నారాయణరెడ్డి, మునిసిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, తహసీల్దార్ రావి రాంబాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. రాజ్యాంగ పరిరక్షణకై ప్రజలందరూ ఐక్యమవ్వాలని రాజ్యాంగ ప్రచార వేదిక రాష్ట్ర నాయకుడు మంతెన సీతారాం అన్నారు. శనివారం డాక్టర్ అంబేడ్కర్ భవనంలో రాజ్యాంగ ప్రచార వేదిక ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా 'అంబేడ్కర్ స్ఫూర్తి-రాజ్యాంగ విలువలు' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమా వేశానికి ఎల్ఐసీ ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాజమండ్రి డివిజన్ నాయకులు ఎస్. అశోక్‌కుమార్ అధ్యక్షత వహించారు. దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్‌కుమార్, ఎస్సీ ఎస్టీ డీవీఎస్‌సీ మెంబర్ జె.సత్యసుధామ, తదితరులు పాల్గొన్నారు. సామాజిక విప్లవ మహోపాధ్యాయుడు డాక్టర్ అంబేడ్కర్ అని టీడీపీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, కృష్ణ బలిజ కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు అన్నారు. భీమవరం పట్టణ టీడీపీ కార్యాలయంలో ఎస్సీ సెల్ నాయకులు బాతు నరేష్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మద్దుల రాము, చెల్లబోయిన గోవింద్, తెలుగు యువత పట్టణ అధ్యక్షుడు గొలగాని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

● ఆకివీడు/కాళ్ల/పాలకోడేరు : రాజ్యాంగాన్ని కాపాడాల్సిన ప్రభుత్వాలే రా జ్యాంగాన్ని నాశనం చేస్తున్నాయని సీపీఎం పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు అ న్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆకివీడు పట్టణంలోని మెయిన్ సెంటర్‌లో వున్న అంబేడ్కర్ విగ్రహానికి సీపీఎం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాళ్ల మండలం ఏలూరుపాడు గ్రామంలో కోనా జోసెఫ్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. ఏలూరుపాడు మాజీ సర్పంచ్ మంతెన ఆంజనేయరాజు, కాళ్ల ఎస్ఐ ఎస్.శ్రీనివాసరావు ఉన్నారు. పాలకోడేరు, మండలంలోని గరగపర్రు, మోగల్లు, కోరుకొల్లు, విస్సాకోడేరు, గొరగనమూడి, శృంగవృక్షం తదితర గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విస్సాకోడేరులోని సెయింట్ జోన్స్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు.

● నరసాపురం టౌన్/మొగల్తూరు : డాక్టర్ అంబేడ్కర్ ఆశయాలను నెరవేరుద్దామని విప్ నాయకర్, టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు అన్నారు. శనివారం అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమంలో భాగంగా సెంటర్‌లోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మత్స్యకార అభివృద్ధి చైర్మన్ కొల్లు పెద్దిరాజు, ఆర్డీవో దాసి రాజు, డీసీసీఎం చైర్మన్ చాగంటి చిన్న తదితరులు పాల్గొన్నారు. మొగల్తూరు మండలంలో మాలమహానాడు, తెలుగుదేశం, జనసేన పార్టీల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● ఆచంట/పెనుగొండ/పోడూరు : ఆచంట మండలం ఆచంట ఏఎంసీ కార్యాలయం వద్ద జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు, తమ్మినీడి ప్రసాద్, బీరా నరసింహమూర్తి, కేతా మీరయ్య, ఎం.నాగసుబ్బారావు అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కొడమంచిలిలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు చిలుకూరి శ్రీను, కొరిపల్లి రామకృష్ణ, బాలం వెంకటరమణ, రాపాక ఆనందరావు, సాయి పాల్గొన్నారు. ఆచంటలో జరిగిన వర్ధంతి కార్యక్రమంలో సర్పంచ్ కోట సరోజిని, సుంకర సీతారామ్, కోట వెంకటేశ్వరరావు, మట్టా చంటి, కేతా రాంబాబు పాల్గొన్నారు. పెనుగొండ మండలం పెనుగొండ పంచాయతీ వద్ద అంబేడ్కర్ చిత్రపటానికి సర్పంచ్ నక్కా శ్యామలా సోనిశాస్త్రి నివాళులర్పించారు. పోడూరు మండలం గుమ్మలూరులో అంబేడ్కర్ విగ్రహ ఆధునీకరణ దాత అమెరికాకు చెందిన ఎన్ఆర్ఐ వర్ధనను బిజూగౌతమ్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పోడూరులో మాల మహానాడు గౌరవాధ్యక్షుడు బుడితి భీమారావు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

● పాలకొల్లు అర్బన్ : పాలకొల్లు గాంధీ బొమ్మల సెంటర్‌లో వున్న అంబేడ్కర్ విగ్రహానికి మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, కూటమి నాయకులతో కలిసి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ నిమ్మల తండ్రి ధర్మారావు పేరుతో ఏర్పాటు చేసిన 107వ రక్తదానశిబిరంలో మంత్రి నిమ్మల 25వసారి రక్తదానం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు గోగుల మండ భాస్కరావు, కొలుకులూరి అర్జునరావు, తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ కార్యాలయంలో, ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో, వైసీపీ కార్యాలయంలో, తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాల వద్ద నివాళులర్పించారు.

●తాడేపల్లిగూడెం/పెంటపాడు:యాగర్లపల్లి, తాలూకా ఆఫీస్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి బీజేపీ తాడేపల్లిగూడెం నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ పూలమాల వేసి నివాళులు అర్పించారు. బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కోట రాంబాబు, అయినం బాలకృష్ణ, రామగాని సత్యనారాయణ, చిట్యాల రాంబాబు, తమరాడ చిన్న కత్తిమండ గణేష్, సింగం జగపతి, తదితరులు పాల్గొన్నారు. పెంటపాడు మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ఎంపీడీవోలు రాంప్రసాద్, టీవీ సత్యనారాయణ, ఎంఈవో-2 టీవీ రామకృష్ణ పూలమాల వేసి నివాళులు అర్పించారు.

● గణపవరం : గణపవరంలోని చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నిర్మలకుమారి ఆధ్వర్యంలో, అర్ధవరంలో కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి చిన్నం చిననాగేశ్వరరావు ఆధ్వర్యంలో, గణపవరంలో జనసేన మండల అధ్యక్షుడు తోట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాల వద్ద నివాళులర్పించారు.



భీమవరంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు



కొడమంచిలిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కూటమి శ్రేణులు



తాడేపల్లిగూడెంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న బీజేపీ నాయకులు



ఆకివీడులో అంబేడ్కర్ విగ్రహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించిన సీపీఎం నేతలు



అభినందన సభలో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల

సనాతన ధర్మాన్ని కాపాడాలి : మంత్రి నిమ్మల

పాలకొల్లు అర్బన్, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): దేవస్థానం పాలక వర్గాలు సనాతన ధర్మాన్ని కాపాడాలని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. స్థానిక యడ్ల బజారులోని కనక దుర్గమ్మ ఆలయ పాలక మండలి అభినందన సభలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. అమ్మవారి సేవలతో చిరస్థాయిగా చరిత్రలో మీ కమిటీ నిలిచి ఉండే విధంగా అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా చైర్మన్ తులా రామలింగేశ్వరరావు, ట్రస్టీలుగా జీవీ రాజ రాజేశ్వరి, కాశీపట్నం వెంకట సత్యభాస్కర్‌పవన్, మడుగుల రమణమ్మ, చిప్పాడ లక్ష్మీ సుధాకాంతారావు, కేవీపీ పుల్లారావు, శిడగం లక్ష్మి, అమలాపురం శ్రీదేవి, అర్చక ట్రస్టీ మోగింటి వెంకట రమణలను ఈ సందర్భంగా మంత్రి నిమ్మల, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, కూటమి నాయులు అభినందించారు. ఈవో ఎన్.సతీష్‌కుమార్, ఉత్సవ కమిటీ నాయకులు దాసరి సత్యనారాయణమూర్తి, గవర శేషగిరిరావు, వీరా శ్రీనివాస్, బోణం వెంకట నారాయణ. సిబ్బంది చిట్టి రాంబాబు, కె.సత్యనారాయణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

14 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు

నరసాపురం రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొప్పర్రు సొసైటీ ఆధ్వర్యంలో 14 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించామని శనివారం సొసైటీ అధ్యక్షుడు అందే నరేన్ తెలిపారు. విప్ నాయకర్ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో 500 మందికి పరీక్షలు చేయించారు. దీనిలో 240 మందికి కళ్లజోళ్లు అందించినట్లు ఆయన తెలిపారు.

సోమేశ్వర స్వామికి లక్ష బిల్వార్చన

పెనుమంట్ర, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ శైవ క్షేత్రం జుత్తిగలోని ఉమావాసుకి రవిసోమేశ్వరస్వామికి వేద పండితులు వేమూరి ఫణీంద్ర శర్మ ఆధ్వర్యంలో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం లక్ష బిల్వార్చన నిర్వహించారు. అర్చకులు వాసుశర్మ, రామకృష్ణ శర్మ, గణేష్ శర్మ, భక్తులు పాల్గొన్నారు

పేదలకు దుప్పట్లు, వస్త్రాలు పంపిణీ

గణపవరం, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే లక్ష్యంగా తమ ట్రస్ట్ పనిచేస్తోందని పూర్ణిమ ట్రస్ట్ చైర్మన్ తులా ఆదినారాయణమూర్తి అన్నారు. శనివారం గణపవరంలో పూర్ణిమ మెమోరియల్ హ్యూమన్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంత మార్కెట్‌లోని వందమంది నిరుపేదలకు నూతన వస్త్రాలు, దుప్పట్లను చైర్మన్ ఆదినారాయణ మూర్తి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో గట్టిం రాజు, సలాది నాని, తులా శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు అత్తిలిలో హిందూ సమ్మేళనం

అత్తిలి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అత్తిలి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మండపంలో ఆదివారం హిందూ సమ్మేళనం జరుగుతుందని నిర్వహణ సమితి వారు తెలిపారు. ముందూరు యాజ్ఞవల్క్య రాజా ఆశ్రమ పీఠాధిపతి డాక్టర్ కృష్ణ చరణానంద భారతీ స్వామి ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు.



పాకా సత్యనారాయణను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్, ఎంపీపీ సత్యనారాయణరాజు, అధికారులు

ప్రతి సమస్యను చర్చించి పరిష్కరించాలి : పాకా

పాలకోడేరు,డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతి సమస్యను చర్చించి పరిష్కరించేలా చూడాలని రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ అన్నారు. పాలకోడేరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీపీ భూపతిరాజు సత్యనారాయణరాజు అధ్యక్షతన అధికారులు నిర్వహించారు. ఈ పాలకపక్షం ఏర్పడ్డాక మండల పరిషత్ సమావేశం మునుపెన్నడూ జరగని రీతిలో రసవత్తరంగా సాగింది. పలు శాఖల అధికారులు మాట్లాడిన ప్రతి మాటకు పాకా సత్యనారాయణ ప్రశ్నలు వేస్తూ వారి వద్ద నుంచి ప్రజలకు ఉపయోగకరమైన సమాధానం వచ్చేలా నిర్వహించారు. ఇకపై సర్వసభ్య సమావేశం జరిగినప్పుడు ముందుగానే ఆయా గ్రామాల్లో ఉన్న సమస్యలను అటు పాలకులు, ఇటు అధికారులు చర్చించి సర్వసభ్య సమావేశంలో పరిష్కరించే విధంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయనను ఎంపీపీ సత్యనారాయణరాజు, ఎమ్మెల్సీ కౌరు శ్రీనివాస్ తదితర ఎంపీటీసీ సభ్యులు, అధికారులు ఘనంగా సత్కరించారు. ఎంపీడీవో రెడ్డియ్య, జడ్పీటీసీ పెద్దిశెట్టి లక్ష్మీతులసి, ఇన్‌చార్జి తహసీల్దార్ రఘు, మండల శాఖ అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సహకార ఉద్యోగుల నిరసన



మొగల్తూరులో నల్లబ్యాడ్జీలతో ఉద్యోగుల విధులు

నరసాపురం రూరల్/మొగల్తూరు డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి):న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ శనివారం సొసైటీ ఉద్యోగు లు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. నరసాపురం మండలంలోని కొప్పర్రు, ఎల్‌బీచర్ల, నరసాపురం, మల్లవరం, సీతారాంపురం, తూర్పుతాళ్ళు, లక్ష్మణేశ్వరం గ్రామాల్లోని సొసైటీ ఉద్యోగులు గంట పాటు విధులకు దూరంగా ఉండి నిరసన తెలిపారు. మొగల్తూరు మండలంలోని సహకార సంఘాల ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. సహకార ఉద్యోగ సంఘ నాయకులు కంచర్ల సోని మాట్లాడుతూ జి.వో 36ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు. నిరసనలో సొసైటీ కార్యదర్శులు పీవీఎస్ కుమార్, గుబ్బల శ్రీనివాసరావు, కొత్తపల్లి గోవిందరాజులు, ఆర్.అర్జున్‌రావు, మేళం ఫణి, కె.వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

'ఎన్టీఆర్ కాలనీని అనుసంధానం చేయాలి'



మాట్లాడుతున్న గోపాలన్

ఆకివీడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ కాలనీని నగర పంచాయతీకి అనుసంధానం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్వీ గోపాలన్ అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎన్టీఆర్ కాలనీ కుప్పనపూడి పంచాయతీ తాళ్ళకోడులో ఉందని, అయితే తాళ్ళకోడులో నివశిస్తున్న కుటుంబాలు ఆకివీడుకు చెందిన వారన్నారు. ఎన్టీఆర్ కాలనీలో సరైన వసతులు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాలనీలో దొంగతనాలు అధికంగా జరుగుతున్నందున పోలీసులు చర్యలు చేపట్టి దొంగతనాలు నివారించాలన్నారు. కె.తవిటినాయుడు, పెంకి అప్పా రావు, బీవీ వర్మ, డోకల లక్ష్మి, రవితేజ, బొడ్డుపల్లి రాంబాబు, ఎస్.ఉదయ్‌కుమారి, బి.కళ్యాణి, ఎస్.పార్వతి, కిసింజర్ తదితరులు ఉన్నారు.



రహదారి పనులు పరిశీలిస్తున్న జేసీ

రోడ్డు పనులు నాణ్యతగా పూర్తిచేయాలి : జేసీ

గణపవరం/పెంటపాడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రహదారి నిర్మాణ పనులు నాణ్యతగా సకాలంలో పూర్తిచేయాలని జేసీ రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. రూ.50 లక్షలు వ్యయంతో చేపట్టిన గణపవరం-వెస్ట్‌విప్పర్రు, కె.పెంటపాడు ఆర్‌అండ్‌బీ తారురోడ్డు నిర్మాణ పనులను శనివారం ఆయన ఆకస్మికంగా పరశీలించారు. అధికారులతో మాట్లాడుతూ పనులు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం పెంటపాడు మండలంలోని పడమరవిప్పర్రులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతులు తమకు దగ్గరలో ఉన్న మిల్లులకు ధాన్యం తరలించుకోవాలని సూచించారు. ఆర్‌డీవో ఖతీబ్‌కౌసర్ బనో, ఏవో చీర్ల రవికుమార్ పాల్గొన్నారు.

భార్య అదృశ్యంపై ఫిర్యాదు

ఉండి, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): తన భార్య కనిపించడం లేదని భర్త కెల్లా సతీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఉండి ఎస్ఐ నజీర్ ఉల్లా తెలిపారు. మహదేవపట్నంకు చెందిన కెల్లా ఆదిలక్ష్మి ఈనెల నాలుగో తేదీ నుంచి కనిపించడం లేదని భర్త ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.